



# విజయభాను






విశాఖపట్నం, శనివారం 16-12-2017 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 93 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఆధార్ డెడ్‌లైన్ మార్చి 31



న్యూఢిల్లీ: అన్ని ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంక్ అకౌంట్లు, మొబైల్ ఫోన్లతో ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడవును పొడిగించారు. ఈ మేరకు శుక్రవారం సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. మార్చి వరకు గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. అయిదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం ఆధార్‌పై తరువాయి 2లో

## ఎలక్ట్రానిక్ వస్తువులపై కస్టమ్స్ సుంకం పెంపు

### సెంట్రల్ బోర్డు అధికారిక ప్రకటన



దిల్లీ: విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని పెంచుతున్నట్లు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. టెలివిజన్, మొబైల్ ఫోన్, ప్రొజెక్టర్, వాటర్ హీటర్‌తో పాటు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులపై కస్టమ్స్ సుంకాన్ని పెంచింది. ఇప్పటి తరువాయి 2లో

## అట్టహాసంగా ప్రారంభమైన తెలుగు పండుగ

- ముఖ్య అతిథి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- అధ్యక్షునిగా ముఖ్యమంత్రి కేసీఆర్
- విశిష్ట అతిధులుగా ఏపీ, మహారాష్ట్ర గవర్నర్లు నరసింహన్, విద్యాసాగర్‌రావు



హైదరాబాద్‌: భాగ్యనగర వేదికగా తెలుగు పండుగ అట్టహాసంగా ప్రారంభమైంది. లాల్ బహదూర్ క్రీడా మైదానంలో పాల్కురికి సోమన ప్రాంగణం బమ్మెర పోతన వేదికపై ముఖ్య అతిథి, భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుక్రవారం (డిసెంబర్ 14) సాయంత్రం.. జ్యోతి వెలిగించి ప్రపంచ తెలుగు మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు కళాకారులు పేరిణీ నృత్యహేళతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షత వహించగా.. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

సభా ప్రాంగణంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పలువురు ప్రముఖులు, తెలుగు భాషాభిమానులతో లాల్ బహదూర్ క్రీడా మైదానం కిక్కిరిసిపోయింది. అతిథులందరినీ ప్రత్యేక బస్సుల్లో సభా స్థలికి తరలించారు. ప్రముఖుల రాక నేపథ్యంలో సభా స్థలి పరిసర ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంతకుముందు హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి తరువాయి 2లో

## రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

- ఆరోగ్య సమస్యలే కారణం
- 19 ఏళ్లుగా పార్టీ అధ్యక్షురాలిగా సేవలు
- శనివారంనుంచి రాహుల్ బాధ్యతల స్వీకరణ
- పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ



దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సంచలన ప్రకటన చేశారు. 19 ఏళ్లుగా ఆ పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న సోనియా.. తాను ఇక రాజకీయాల నుంచి తప్పుకోనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. సోనియా కుమారుడు రాహుల్‌గాంధీ ఇటీవల పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. శనివారం ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో సోనియా కీలక ప్రకటన చేయడం జాతీయ రాజకీయాల్లో ఆసక్తిగా మారింది.

శుక్రవారం ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలకు సోనియాగాంధీ హాజరయ్యారు. సభ వాయిదా అనంతరం తిరిగి వెళ్తున్న సమయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాహుల్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో మీ పాత్ర ఎలా ఉంటుంది? అని ఓ విలేకరి సోనియాను ప్రశ్నించారు. దీనికి ఆమె సమాధానమిస్తూ.. నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా అని ప్రకటించారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ శనివారం తరువాయి 2లో

## తలాక్ బిల్లుకు కేంద్రం ఆమోదం

- శీతాకాల సమావేశాల్లో బిల్లుకు ప్రతిపాదన
- ముమ్మార్లు తలాక్ చెబితే చట్టరీత్యా నేరం.. మూడేళ్ల జైలు శిక్ష

దిల్లీ: ముమ్మారు తలాక్ బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. త్వరలోనే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు చట్టంగా మారితే ఇకపై ముస్లిం మహిళలకు భర్తలు ముమ్మార్ తలాక్ చెబితే.. దాన్ని చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. అందుకు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ముస్లిం విమెన్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ మ్యారేజ్ బిల్ పేరుతో ఉన్న ఈ ముసాయిదా బిల్లుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని బృందం ఈ ముసాయిదాను రూపొందించింది. ఈ




బృందంలో కేంద్రమంత్రులు సుష్మా స్వరాజ్, అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, పీపీ చౌదరి ఉన్నారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతి చెల్లబోదని సుప్రీంకోర్టు ఆగస్టు నెలలో సంచలన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తలాక్ పద్ధతిని వ్యతిరేకిస్తూ కొందరు మహిళలు వేసిన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది. దీనిపై చట్టాన్ని తీసుకురావాల్సిందిగా సుప్రీం కేంద్రాన్ని ఆదేశించింది.

## ఐ బెగ్‌టు పదాన్ని సభలో వాడొద్దు

- అది వలసవాదానికి నిదర్శనం
- ఇది నా సలహా.. ఆదేశం కాదు
- రాజ్యసభలో వెంకయ్య మార్కు!



న్యూదిల్లీ: రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన మార్కును చూపించారు. ఇప్పటి వరకు రాజ్యసభలో పత్రాలను ప్రవేశపెట్టేటప్పుడు సభ్యులు ఐ బెగ్ టు అని పలికేవారు. సభ్యులు ఇకపై ఆ పదాన్ని వాడొద్దని వెంకయ్యనాయుడు సూచించారు. అది వలసవాదానికి నిదర్శనమని, ప్రస్తుతం మనం స్వతంత్ర భారతదేశంలో జీవిస్తున్నామని చెప్పారు.

పార్లమెంట్ శీతకాల సమవేశాల ప్రారంభం సందర్భంగా తొలిరోజు రాజ్యసభలో వెంకయ్యనాయుడు ఈ సూచన చేశారు. పత్రాలను ప్రవేశపెట్టేటప్పుడు కొందరు ఐ బెగ్ టు తరువాయి 2లో

## అందరి సమస్యలూ తీరుస్తా

- బాబులా నేను మోసాలు చేయను
- ధర్మవరంలో వైఎస్ జగన్ పర్యటన



అనంతపురం: జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రను కొనసాగిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో నియోజకవర్గాన్ని దాటేశారు. జిల్లాలోని రాప్తాడు తరువాయి 2లో






## ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిందే



### రాజ్యసభలో కాంగ్రెస్ నేతల డిమాండ్

దిల్లీ: పార్లమెంట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలకు గాను క్షమాపణ చెప్పాలని రాజ్యసభలో కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ డిమాండ్ చేశారు. ఉదయం ప్రారంభమైన రాజ్యసభ సమావేశాలు మధ్యాహ్నం వరకు రెండు సార్లు వాయిదా పడ్డాయి. జేడీయూ రెబల్ నేత శరద్‌యాదవ్, అలీ అన్వర్ రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయడంపై పలు పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు సభ్యులకు సర్దిచెప్పాలని ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఆయన తన వాక్చాతుర్యంతో ఆల్ ఇన్ వెల్.. నాట్ వెల్ అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ వాళ్లు వినకపోవడంతో సభను వాయిదా వేశారు.

అనంతరం 12గం.లకు సభ తిరిగి ప్రారంభంకాగానే మన్మోహన్ తరువాయి 2లో

# రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు



రావులపాలెం : ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహెూన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొత్తపేట శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భముగా స్థానిక వైఎస్సార్సీపి కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహెూన్నత వ్యక్తి అని, సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహా వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, కర్రి నాగిరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, మన్యం భాను, వరప్రసాద్, కర్రి గోవింద కృష్ణారెడ్డి, ఎమ్‌పిటిసిలు బొక్కా ప్రసాద్, కొండేపూడి రామకృష్ణ, పార్టీ కన్వీనర్ దొమ్మేటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ మహిళాధ్యక్షురాలిగా తాడి లక్ష్మిదుర్గ



రావులపాలెం : స్థానిక టిడిపి కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రావులపాలెం టౌన్ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా తాడి లక్ష్మీదుర్గను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎంపిక పట్ల నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, గృహఋణాల మంజూరు, వంటి సంక్షేమ కార్యక్రమాలు ఒక్క టిడిపి ప్రభుత్వానికే సాధ్యమని, టిడిపి పేదల ప్రభుత్వమని, మరీ ముఖ్యంగా మహిళా సంక్షేమం కోసం అహర్నిసలు కృషి చేసేది చంద్రబాబు ప్రభుత్వమే అని, రాష్ట్రం కోసం చంద్రబాబు చేస్తున్న నిరంతర కృషిని ఆమె కొనియాడారు. ఈ సందర్భముగా తాడి లక్ష్మీ దుర్గను డిసిఎమ్ఎస్ చైర్మన్ కె.వి. సత్యానారాయణరెడ్డి, సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ కొవ్వూరి జగన్నాధరెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, వెలగల శ్రీనివాసరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, మైగాపుల గురవయ్యానాయుడు, కుడుపూడి శ్రీను, గుత్తుల శ్రీనివాసరావు, సయ్యపరాజు జనార్ధన రాజు, మేడపాటి కాసురెడ్డి, సిద్దిరెడ్డి శ్రీను, ధోనెపూడి దుర్గ, కె. రాధలు అభినందించారు.

## దివ్యాంగులకు చేయూతనిచ్చిన విశాఖ ఉక్కు కర్మాగారం

గాజువాక: సామాజికసేవా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఆర్.ఐ.ఎన్.ఎల్) విశాఖ ఉక్కుకర్మాగారం సి.యస్.ఆర్. నిధుల నుంచి దివ్యాంగులు గల ఎస్సి, ఎస్టి పిల్లలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. శుక్రవారం విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 120 మంది పిల్లలకు ఉక్కునగరం లోని అరుణోదయ ప్రత్యేక పాఠశాలలో ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ (టి.ఎల్.ఎం) కిట్‌లను అందజేసింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ దివ్యాంగులకు ప్రతి ఒక్కరికి రూ. 10వేలు చొప్పున నైపుణ్యత శిక్షణ కోసం అందివ్వడం జరిగింది. శిక్షణ శిబిరాన్ని ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) కిషోర్ చంద్రదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం దివ్యాంగులకు నైపుణ్యత శిక్షణ ను అందించడం కోసం కృషి చేస్తున్నందన్నారు. ఈ శిక్షణ కోసం ఉక్కు యాజమాన్యం రూ. 30లక్షలతో 100 ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్.ఐ.ఈ.పి.ఐ.డి సంస్థ తో ఈ శిక్షణ శిబిరాన్ని కలిసి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఫరెంట్లీ ఇబ్లీడ్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్, సీనియర్ సిటిజన్స్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తొలిసారిగా సంగీత ప్రదర్శన ఇవ్వనున్న రెహమాన్

పెదపూడి : స్వరమంత్రికుడు ఏఆర్ రెహమాన్ రాష్ట్రంలో తొలిసారిగా తన సంగీత ప్రదర్శన నిర్వహించనున్నారు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ సిద్ధమవుతుంది కాకినాడ బీచ్ ఫెస్టివల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు ఈ నెల 21న జరిగే రెహమాన్ సంగీత విభాగానికి విశేష స్పందన వస్తుందని అంచనా వేస్తున్న పర్యాటకశాఖ ఈ కార్యక్రమానికి ఏలాంటి పాసులు లేకుండానే ప్రజల్లంతా పాల్గొనేల ఏర్పాట్లు చేస్తోంది ఏటా జరిగే ఈ సాగర సంబరాలకు 6నుంచి 7లక్షల ప్రజలు వస్తుంటారు ఈ సారి రెహమాన్ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని సుమారు 12 లక్షల మంది వస్తారని అంచనా వేస్తూ జిల్లా యంత్రాంగం దానికి తగ్గట్టుగా గత 10రోజుల నుంచి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు

## బేతని విద్యా సంస్థలో క్రిస్మస్ సంబరాలు



రావులపాలెం : బేతని విద్యా సంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొల్లపల్లి లూదియమ్మ పాల్గొని మాట్లాడుతూ క్రీస్తు భూలోకానికి రావడం వల్ల మనుష్యులందరూ దనులుగా మార్చబడ్డారని అన్నారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలసి క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో కరస్పాండెంట్ గొల్లపల్లి శ్రీధర్, ప్రసాద్, ప్రిన్సిపాల్స్ రాజేశ్వరరావు, నాగబాబు, వి. శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో సిపిఎమ్ బైక్ ర్యాలీ



అచ్యుతాపురం: వచ్చే నెల 7, 8 తేదీలలో అచ్యుతాపురంలో జరిగే జిల్లా 22వ మహా సభలను జయప్రదం చెయ్యాలని సిపిఎమ్ జిల్లా కార్యదర్శి కె.లోకనాధం అన్నారు. సిపిఎమ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని స్థానిక శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి నాలుగు వైపులా సిపిఎమ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. సెజ్‌లో గల పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయడంలేదని, స్థానికులకు, నిర్వాసితులకు పరిశ్రమల్లో ఉపాది కల్పించట్లేదని ఆవేదన వ్యక్తంచేసారు. కార్మిక, కర్షక, నిర్వాసితులు, మహిళలు, యువత సమస్యలపై చర్చించి భవిస్యత్తు కార్యచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం సిపిఎమ్ మహాసభలు నిర్వాహణకోసం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎమ్ మండల కన్వినర్ రొంగలిరాము, బుద్దా రంగారావు, కర్రి అప్పారావు, గణిశెట్టి సత్యనారాయణ, కె.సోము నాయుడు, సిహెచ్ గంగరాజు, చేపల తాతయ్య, జి.దేముడు నాయుడు, జి.కోటేశ్వ ర్రావు, శాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

బాధ్యతలు స్వీకరించనున్నారు. దాదాపు 19ఏళ్ల పాటు పార్టీ అధినేత్రిగా కొనసాగిన సోనియా పార్టీని కుమారుడి చేతుల్లో పెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ తర్వాత పూర్తిస్థాయి అధ్యక్షుడిగా రాహుల్ కొనసాగనున్నారు. సోనియా ఇటీవల తరుచూ అనారోగ్యానికి గురవుతున్నారు. క్యాన్సర్‌కు సంబంధించి చికిత్స పొందుతున్నారు. చికిత్స నిమిత్తం ఇటీవల అమెరికా కూడా వెళ్లి వచ్చారు. రాహుల్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించాలని కొంతకాలంగా సోనియా భావిస్తున్నారు. ఇన్నాళ్లకు ఆమె కల నెరవేరడంతో ఇక రాజకీయాలకు స్వస్తి చెప్పాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆధార్ డెడ్‌లైన్ మార్చి 31

మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఆధార్‌ను అన్ని స్కీమ్‌లకు అనుసంధానం చేయాలన్న అంశంపై సుప్రీంకోర్టులో పలు పిటీషన్లు విచారణకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ కార్డు లేని వారు కూడా తాజా ఆదేశాలతో కొత్తగా బ్యాంక్ అకౌంట్లు తీసుకోవచ్చు. ఆధార్‌పై మళ్లీ జనవరిలో విచారణ చేపట్టనున్నారు. గతంలో డిసెంబర్ 31 వరకు ఉన్న డెడ్‌లైన్‌ను శుక్రవారం మరో మూడు నెలల వరకు పొడిగించారు.

## ఎలక్ట్రానిక్ వస్తువులపై కస్టమ్స్ సుంకం పెంపు

వరకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పలు కంపెనీల టెలివిజన్లపై 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని వసూలు చేస్తున్నారు. ఇకపై దాన్ని 20శాతానికి పెంచారు. ఇక కీప్యాడ్ ఉన్న మొబైల్ ఫోన్లపై 15శాతం వసూలు చేయనున్నట్లు సీబీఈసీ వెల్లడించింది. వాటర్‌హీటర్, హెయిర్ డ్రెస్సింగ్ యంత్రాలపైనా 20శాతం కస్టమ్స్ సుంకాన్ని వసూలు చేయనున్నట్లు రెవెన్యూ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

మేక్ ఇన్ ఇండియాను భారత్‌లో విస్తరించడం, స్వదేశీ ఉత్పత్తుల అమ్మకాలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఇలా చేయడం వల్ల వీటిని తయారు చేస్తున్న కంపెనీల మధ్య పోటీతత్వం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జులైలో తొలిసారిగా మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని విధించింది.

## ఐ బెగ్‌టు పదాన్ని సభలో వాడొద్దు

(నేను వేడుకుంటున్నా) అనే పదాన్ని వాడడం చూసిన వెంకయ్య ఈ సూచన చేశారు. అయితే, ఇది తన సలహా మాత్రమేనని, ఆదేశం కాదని సభ్యులకు చెప్పారు. అంతేకాదు మృతిచెందిన సభ్యులకు సంతాప ప్రకటన సందర్భంలోనూ సభలో వెంకయ్య నిల్చోవడం కనిపించింది. అంతకుముందు ఛైర్మన్లుగా వ్యవహరించిన హమీద్ అన్సారీ, భైరాన్ సింగ్ షెకావత్ మాత్రం కూర్చునే ఉండేవారు. అటు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సైతం సంతాప ప్రకటన సమయంలో నిల్చుంటూ ఉంటారు.

## ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిందే

సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పాకిస్థాన్ జోక్యం చేసుకుందని, ఆ దేశ అధికారులతో మన్మోహన్, ఇతర కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారంటూ మోదీ ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు గాను మోదీ క్షమాపణలు చెప్పాల్సిందిగా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

***తొలిసారి రాజ్యసభకు అమిత్‌షా***

భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తొలిసారి ఎంపీ హోదాలో రాజ్యసభకు విచ్చేశారు. ఆయనకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. ఆగస్టులో గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అమిత్‌షా, స్మృతి ఇరానీ విజయం సాధించిన విషయం తెలిసిందే,

## అందరి సమస్యలూ తీరుస్తా

నియోజకవర్గం పరిధిని దాటి ధర్మవరం నియోజకవర్గంలోకి జగన్ పాదయాత్ర చేరింది. 35 రోజు అయిన గురువారంతో జగన్ పాదయాత్ర ధర్మవరం పరిధిలోకి ప్రవేశించింది.

ఇప్పటి వరకూ అనంతపురం నియోజకవర్గంలోని గుంతకల్, తాడపత్రి, ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల్లో జగన్ పాదయాత్ర సాగింది. ధర్మవరం నియోజకవర్గంలో సాగుతోంది. అనంతరం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల మీదుగా జగన్ పాదయాత్ర సాగుతుంది. ఇప్పటి వరకూ జగన్ మోహన్ రెడ్డి 487 కిలోమీటర్ల దూరాన్ని నడించారు.

ధర్మవరం నియోజకవర్గం ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఉంది. కందుకూరులో గురువారం జగన్ పాదయాత్రకు మంచి స్పందన కనిపించడం గమనార్హం. వృద్ధులు, వికలాంగులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ సాగుతున్నారు జగన్ మోహన్ రెడ్డి. వారిని ప్రధానంగా పెన్షన్ విషయంలో ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. డ్వాక్రా మహిళలు రుణమాఫీ గురించి అడుగుతున్నారు. తమ ప్రభుత్వం వస్తే.. అందరి సమస్యలనూ తీరుస్తానంటూ జగన్ సాగుతున్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన తెలుగు పండుగ

వెంకయ్య నాయుడు బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం అందుకున్నారు. గవర్నర్ నరసింహన్, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు నాయినీ, పద్మారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన సభా స్థలికి బయల్దేరి వెళ్లారు.

# చర్చల్లేకుండానే మున్సిపల్ సమావేశం.. అజెండా ఆమోదం..!

**– సమావేశం పేరుతో సమయం వృధా..! – ప్రజా సమస్యలు పరిష్కారం కావట్లేదని కౌన్సిల్ సభ్యుల ఆవేదన**

పిఠాపురం : ఎటువంటి చర్చాలేకుండానే ప్రతిపాధిత పనులు ఆమోదం పొంది సమాదేశం పేరిట సమయం వృధా అయింది. మున్సిపల్ ఛైర్మన్ కరణం చిన్నారావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలు నందు నిర్వహించిన సమావేశంలో సుమారు కోటి రూపాయల పైబడిన పనులకు సభలో ఎటువంటి చర్చాలేకుండానే ఆమోదించబడటం విశేషం. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టనున్న 30 అంశాలతో కూడిన అభివృద్ధి పనులు వివరాలను సభలో చదివి వినిపించడం జరిగింది. సంబంధిత వార్డు కౌన్సిలర్లు ఎవరూ ఈ విషయాలపై చర్చించిన దాఖలాలులేవు. గతంలో తన వార్డులో 2015, 2016, 2017సంవత్సరాల్లో మూడు ప్రజా సమస్యలపై అభివృద్ధి పనులు సభ ఆమోదించినప్పటికీ నేటి వరకూ వాటిని ప్రారంభించకపోవడం పట్ల 11వ వార్డు కౌన్సిలర్ డనామా దొరబాబు గట్టిగా నిలదీశారు. సింగిల్ టెండర్ రద్దు చేయమని గతంలో కోరడం జరిగిందని, అలాంటి పనులను ఆమోదించవలసిన పని ఏమొచ్చిందని ప్రశ్నించారు. పుష్‌కార్టులవల్ల ఉపయోగంలేదని గతంలో అవి పనిచేయలేదని పుష్‌కార్టుల కొనుగోలు చేయవలసిన అవసరం ఏమొచ్చిందని దొరబాబు అన్నారు. దీనిపై కమీషనర్ రామ్మోనరావు ఇచ్చిన సమాధానంపై దొరబాబు సంతృప్తి చెందలేదు. తన వార్డులో డ్రైన్లు రిపేరు, సీసీ రోడ్డు నిర్మాణం, పైపులైను ఏర్పాటు పనులు మూడేళ్లుగా పెండిగ్‌లోనే ఉన్న విషయం సభ ముందు ఉంచగా మున్సిపల్ డిఈ ప్రభాకర్ పైపులైను పనులు త్వరలోనే ప్రారంభిస్తామని సమాధానమిచ్చారు. హ్యాపీ సండే నిర్వాహణకు వినియోగిస్తున్న కుర్చీలు, టెంట్లు వంటివి అద్దె ప్రాతిపదికన కాకుండా మున్సిపల్ నిధులు రూ.2.50లక్షలు వెచ్చించి కొనుగోలు చేయవలసిన అవసరం ఏమొచ్చిందని కౌన్సిలర్ ఖండవల్లి సుబ్బారావు ప్రశ్నించారు. తమ వార్డులో వాటర్ సప్లై సక్రమంగా జరగడంలేదని కౌన్సిలర్ విజయలక్ష్మి ప్రశ్నించగా శివారు ప్రాంతం కావడంవల్ల కొంత అసౌకర్యం ఏర్పడుతుందని పరిస్థితిని చక్కదిద్దుతామని మున్సిపల్ డిఈ సమాధానమిచ్చారు.

రెండేళ్లుగా తన వార్డులో ఆమోదించిన వర్కు ఆరంభించలేదని కౌన్సిలర్ వేణుం సురేష్ నిలదీశారు. డ్రైన్లు అభివృద్ధి పనులు చేపట్టకపోవడం వలన మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఏళ్ల తరబడి తన వార్డులో పనులు జరగనందుకు వార్డు ప్రజల్లో తన పట్ల చులకనభావం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డిఈ సమాధానమిచ్చారు.

అదే విధంగా రాజీవ్ గాంధీ హైస్కూల్‌లో ఫ్లోరింగ్ పాడై విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని, దానిని సత్వరం రిపేర్లు చేయించమని సురేష్ కోరారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జ్యోతీరావు పూలే విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని 14వ వార్డు కౌన్సిలర్ శిరం అప్పారావు కోరారు. గతంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని అదే రీతిని పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని అప్పారావు సభకు వివరించారు. మున్సిపాల్టీలో ఏర్పడిన వివిధ పోస్టులకు సంబంధించి ఎనిమిది కాలీలను ఔట్‌సోర్సింగ్ పద్దతిలో రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ & ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ వారిచే నియమించబడిన విషయాన్ని మున్సిపల్ మేనేజర్ మూర్తి సభకు తెలియజేశారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మళ్లీ భేటీకి రజనీ నిర్ణయం

చెన్నై : దక్షిణ భారత చలన చిత్ర సూపర్ స్టార్ రజనీకాంత్‌ను రాజకీయాల్లోకి లాగేందుకు ఆయన అభిమాన లోకం చేస్తున్న ప్రయత్నాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమ్మ జయలలిత మరణం తదుపరి పరిణామాలతో రజనీ రాజకీయాల్లోకి రావాలనే నినాదం మిన్నంటుతోంది. ఈ సమయంలో మే నెలలో అభిమానులతో రజనీకాంత్ సమావేశం కావడం, యుద్ధానికి సిద్ధం అవుదామని ఇచ్చిన పిలుపు రాజకీయంగా చర్చకు దారితీసింది.

అయితే, రాజకీయ ప్రవేశం గురించి రజనీ నాన్చుడు ధోరణి అనుసరించడం మొదలెట్టారు. అదే సమయంలో తాను వచ్చేశానంటూ లోక నాయకుడు కమల్ రాజకీయ ప్రకటన చేశారు. రాజకీయ ఎదుగుదల మీద దృష్టి పెట్టి అందుకు తగ్గ కసరత్తుల్లో విశ్వనాయకుడు నిమగ్నమై ఉన్నారని చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో తమ కథానాయకుడు సైతం రాజకీయాల్లోకి రావాలనే ఆశతో రజనీ అభిమానులు ఎదురుచూపుల్లో పడ్డారు.

ఈనెల 12న జరిగిన రజనీ 68వ బర్త్ డే వేళ రాజకీయ ప్రకటన వెలువడుతుందనే ఆశతో ఎదురుచూశారు. అయితే, ఎక్కడా రజనీ చిక్కలేదు. ఏకంగా అభిమా నులకు దూరంగా బర్త్‌డేను జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో అభిమానుల్ని పలకరించేందుకు వస్తున్నా...! అంటూ తలైవా ప్రకటించారు.

***అభిమానులతో కథానాయకుడు***

అభిమానుల్ని పలకరించేందుకు మళ్లీ రజనీ సిద్ధం అయ్యారు. రోజుకు వెయ్యి మందిని కలిసేందుకు నిర్ణయించారు. ఈనెల 26నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఆయన అభిమానులతో భేటీ కానున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3 గంటలకు కోడంబాక్కంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో అభిమానుల్ని రజనీ కలవనున్నారు. ఈ భేటీకి భద్రత కల్పించాలని చెన్నై పోలీసులకు రజనీ లెటర్‌హెడ్ ద్వారా విజ్ఞప్తి చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఈ సమాచారం ఆయన అభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. అదే సమయంలో రాజకీయ చర్చ మళ్లీ ఊపందుకుంది. రజనీ రాజకీయాల్లోకి తప్పకుండా వస్తారని, త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తారని పదే పదే ఆయన సోదరుడు సత్యనారాయణ చెప్పుకుంటూ వస్తున్నారు. బర్త్ డే వేళ సైతం త్వరలో మంచి నిర్ణయాన్ని రజని ప్రకటిస్తారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో అభిమానులతో రజనీ భేటీ కానుండడంతో రాజకీయ అరంగ్రేటం మీద నిర్ణయాన్ని తీసుకుంటారా? అనే చర్చ ఊపందుకుంది. రజనీని అభిమానించే కొన్ని ఇతర సంఘాల ప్రతినిధులు అయితే, ఇదే సరైన నిర్ణయం అని, అభిమానులతో చర్చించి రాజకీయ ప్రవేశంపై ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 31 వరకు ఓటర్ల జాబిత సవరణ

పెద్దాపురం : ముఖ్య ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు శుక్రవారం నుండి ఈ నెల 31వరకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వరహాలయ్య తెలిపారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకొనేవారు ఓటరు జాబితాలో సవరణ మార్పులు, తొలగింపుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న ముసాయిద ఓటర్ల జాబితా ప్రచురణ, 15 నుండి 31 వరకు నమోదు ధరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరణ 17 నుండి 24 వరకు రాజకీయ పార్టీల భూత్‌లెవెల్ ఏజంట్లతో అవగాహన కార్యక్రమం ఉంటుదన్నారు. జనవరి 10న దరఖాస్తులు, అభ్యంతరాలు పరిష్కారం, జనవరి 20న ఓటర్ల తుదిజాబిత ప్రచురిస్తారని తెలిపారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG ...ahead
ELECTRICAL - SECTION
'e' Procurement Tender Notice No:10/2017-18/SE(Elec)/EE(Elec), Dt:14-12-2017

| | | |
|---|---|---|
| 01. | Number of Works | : 4 Nos |
| 02 | Value of Works (ECV) | : Rs.29.08 Lakhs |
| 03. | Down Loading Start Date | : 15-12-2017 @ 04.00 PM |
| 04. | Down Loading End Date | : 30-12-2017 @ 01.00 PM |
| 05. | Last date &Time for receipt of Bids | : 30-12-2017 @ 02.00 PM |
| 06 | Date of opening Tenders | : 30-12-2017 @ 03.00 PM |

Note:Further details at http://www.apeprocurement.gov.in
O/o the EE (Electrical) Cell No.9848882588 S.E(Electrical)
స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ విశాఖ
ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి

## ప్రథమ హాస్పిటల్‌లో

# పాలియాటివ్ కేర్ విభాగం ప్రారంభం




విశాఖపట్నం : వెంకోజిపాలెంలో గల ప్రథమ హాస్పిటల్ నందు 'పాలియాటివ్ కేర్ విభాగం ఛాంబర్ & వార్డులను శుక్రవారం కరూర్ వైశ్యా బ్యాంక్ డైరక్టర్ డా.వి.జి.మోహన్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమా జానికి పాలియాటివ్ కేర్ సౌకర్యాలు అత్యవసరమని అన్నారు. ఈ సందర్భంగా ప్రథమ హాస్పిటల్ పాలి యాటివ్ కేర్ విభాగం చీఫ్ కన్సల్‌టెంట్ డా.ఎన్.ఎస్. రాజు మాట్లాడుతూ సాధా రణంగా దీర్ఘకాల వ్యాధులు, ముఖ్యంగా క్యాన్సర్ వంటివి ముదిరితే వ్యాధిని నయం చేయలేని పరిస్థితి. ఆ వ్యక్తి కొద్ది నెలల్లో చనిపోయే పరిస్థితి రావచ్చు. ఇలాంటి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న రోగుల వ్యాధి లక్షనాలను తగ్గించి, వారికి మానసిక ధైర్యాన్ని కలిగిస్తూ, నొప్పి, ఇతర బాధల నుండి ఉపశమనం కలిగేలా చేస్తామని అన్నారు. ఈ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముందని తెలిపారు. క్యాన్సర్, కిడ్నీలు చెడిపోవడం, లివర్ డ్యామేజి వంటి నయం కాని దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న రోగుల వ్యాధి లక్షణాలను తగ్గించి, వారు బ్రతికినంతకాలం నొప్పి, ఇతర బాధల నుండి ఉపశమనం కలిగేలా చేసి, వారి జీవన నాణ్యతను పెంచడమే పాలియాటివ్ కేర్ ముఖ్య ఉద్దేశమని, ఆంధ్రప్రదేశ్‌లోనే కార్పొరేట్ హాస్పిటల్‌లో ప్రథమంగా పాలియాటివ్ కేర్ విభాగాన్ని ప్రథమ హాస్పిటల్‌లో ఏర్పాటు చేశామని, ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవల సిందిగా ప్రథమ హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డా.పి.విశ్వేశ్వరరావు కోరారు.

# జివిఎంసి కార్మికుల నిరవధిక సమ్మె పోస్టర్ విడుదల

విశాఖపట్నం : మున్సిపల్ పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18 నుండి చేస్తున్న నిరవధిక సమ్మె పోస్టర్‌ను ఈరోజు జివిఎంసి జాయింట్ యాక్షన్ కమిటీ సిఐటియు కార్యాలయంలో విడుదల చేసింది. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ వి.వి.వామనరావు మాట్లాడుతూ 010 ప్రకారం జివిఎంసి ఉద్యోగుల వేతనాలు చెల్లింపు వాగ్దానం ప్రభుత్వం మాట తప్పటంతో జివిఎంసిపైన 300కోట్లు భారం పడుతోందని ప్రభుత్వం వివక్షత చూపటం వలన నగర అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. సిపిఎస్‌ని రద్దుచేయాలని, ఎంఎంఆర్, బదిలి, ఎంటిఎస్‌లను పర్మినెంట్ చేయాలన్నారు. జివిఎంసి ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధానకార్యదర్శి పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల వేతనాలకు సంవత్సరానికి 81కోట్లు అవుతుంటే ప్రభుత్వం 279 జీవో తెచ్చి సంవత్సరానికి 99కోట్లకు బడా కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచిందని ప్రతి ఇంటి నుండి నెలకు 50రూ॥లు యూజర్ ఛార్జీల పేరుతో ఆ భారాన్ని ప్రజలపై మోపటాన్ని జెఎసి వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసే 279జీవో రద్దయ్యేవరకు పోరాడుతామన్నారు. కె.రామామూర్తి (హెచ్ఎంఎస్) మాట్లాడుతూ 18నుండి సమ్మెకు ప్రభుత్వానిదే భాద్యత అన్నారు.

కె.కనకరాజు (ఐఎన్‌టియుసి) మరియు కె.సత్యన్నారాయణ (వైఎస్సార్‌టియు) మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులు మరియు కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించకుంటే కాంట్రాక్టు కార్మికులతోపాటు పర్మినెంట్ ఉద్యోగులను కూడా సమ్మెలోకి దిపుతామన్నారు. గోడపత్రికా ఆవిష్కరణ సభలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు) ప్రధానకార్యదర్శి టి.నూకరాజు, నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక స్వావలంభనకై సేంద్రీయ ఎరువులు



పశు సంపద రంగంలో ఎటువంటి రసాయనాలు ఉవయోగించకుండా పూర్తిగా సహజ సిద్దమైన సేంద్రీయ ఉత్పత్తులను తీసుకు రావడం జరిగిందన్నారు. ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తమ ఉత్పత్తులు వాడకం వలన రైతులు అధిక ఉత్పత్తుల, ఆరో గ్యవంతమైన పశు సంపద నిర్వ హణలో ముందంజలో వుందన్నారు.రీజనల్ సేల్స్ మేనేజర్ రవి ఇందకూరి మాట్లాడుతూ నేడు వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలలో ఒకటి అధిక రసాయనిక ఎరువుల వినియోగం, దీనిని అధిగమించేందుకు నో వార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సేంద్రీయ ఎరువులు ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అధిక రసాయనిక ఎరువులు, క్రిమిసంహారాలు వాడకం వలన భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గిపోతుం దన్నారు. దీని వలన రైతులు ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంచైజ్ యాజమాని టీవీఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఈ సంస్థతో భాగస్వామ్యమైనందుకు ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ విలువైన సేంద్రీయ ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతీ మారు మూల ప్రాంతానికి అందించాలని లక్ష్యంగా నిర్ణయించు కున్నట్టు తెలిపారు.

విశాఖపట్నం : రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వారికి స్థిర ఉపాధి కల్పించడం కోసం ప్రత్యేక సేంద్రీయ ఎరువులు ఉత్పతిని తమ సంస్థ ప్రారంభించిందని నోవార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ సుబిర్ రంజన్ దాస్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో శుక్రవారం "నోవార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్" వ్యవసాయ సేంద్రీయ ఉత్పత్తులు, జంతు ప్రపంచ ఆహార అవసరాలను తీర్చడానికి తమ కార్యకలాపాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా రంజన్‌దాస్ మాట్లాడుతూ ఆహారాన్ని శుభ్రంగా ఆరోగ్యంగా, సురక్షితంగా తయారు చేయడానికి నోవార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్ కంపెనీ పశు సంవర్ధక యాజమానులు సంతృప్తి కోసం అద్భుతమైన ఫలితాలు ద్వారా సురక్షితమైన జంతు ఉత్పత్తులను ప్రారంభించినట్టు తెలిపారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ రంగంపై ఆధారపడి వుందని, రైతులు వ్యవసాయం , పశుసంపద మీద ఆధారపడి వున్నారన్నారు. దీని వలన దేశంలో రైతులు మరణాలు నిష్పత్తి, పేదరికం పెరుగున్నదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి పూణేలో వున్న నోవార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సేంద్రీయ ఎరువులు, పశు సంపద సేంద్రీయ పోషక ఆహారం ఉత్పత్తిని ప్రారంభించినట్టు తెలిపారు. తమ సంస్థ వ్యవసాయ,

జాతీయ మీడియా మేనేజర్ నో వార్క్ ఆర్గానిక్స్ లిమిటెడ్ ఆశాలత నాయక్ మాట్లాడుతూ తమ ఉత్పత్తును తెలియచేస్తూ పరోక్షంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సహాయ పడుతుందని, " నేడు రైతే రాజు" అనే నినాద కృషికై దోహదపడుతుందన్నారు.


# అత్యంత వైభవంగా అష్టలక్ష్మి ఆరాధనోత్సవం



విశాఖపట్నం : శ్రీ వాసవి స్నేహాలయం మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ఒన్ టౌన్ దరి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో లోకకళ్యాణార్థం అష్టలక్ష్మి ఆరాధనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినాము. మంగళధ్వని, వేదమంత్ర పఠనముల మధ్య విఘ్నేశ్వర పూజను ఆచరించి అష్టలక్ష్మిలను ఆహ్వానించి ముత్తైదువలచే అత్యంత భక్తి శ్రద్ధలతో వేదోక్తంగా, శాస్త్రోక్తంగా విశేష అలంకారముతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించడమైనది. మహిళలు సామూహికంగా ముక్తకంఠంతో నిర్వహించిన శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీ లక్ష్మి అష్టోత్తరం, శ్రీ లక్ష్మి సహస్ర నామం, శ్రీ లలితా సహస్ర నామం, వేదపఠనములా కొనసాగడమే కాకుండా వేద వైభవాన్ని సంతరించుకొంది. ప్రత్యేక పూజాదికార్యక్రమాలనంతరం అష్టలక్ష్మి దేవిలకు నివేదన, నీరాజన, మంత్రపుష్పములు సమర్పించి విచ్చేసిన మహిళలందరికీ తీర్థప్రసాదములు, పంచ అన్నముల ప్రసాదము వితరణ చేయడం జరిగింది. పూజావేదికపై ఏర్పాటు చేసిన అష్టలక్ష్మి స్వరూపాలంకరణ ప్రత్యేకతను సంతరించు కోవడమే కాకుండా అందరిలోను భక్తి పారవశ్యాన్ని నింపింది పై కార్యక్రమంలో శ్రీ వాసవి స్నేహాలయం అధ్యక్షురాలు కె.వసుంధర, కార్యదర్శి కేతవరపు ఉమ, కార్యక్రమ సంధాన కర్తలు మట్టపల్లి సీత, సి.వి.ఎస్. విశాలాక్షి, అధిక సంఖ్యలో మహిళలు, సంస్థ సభ్యులు హాజరైనారు.

# ఉత్తరాంధ్ర కాంగ్రెస్ కార్యకర్తల సదస్సును విజయవంతం చేయండి

## మాజీ మంత్రి పసుపులేటి బాలరాజ



విశాఖపట్నం : పోర్టు కళావాణిలో నిర్వహించే ఉత్తరాంధ్ర కాంగ్రెస్ కార్యకర్తల సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పిలుపు నిచ్చారు. సీతమ్మధారలో జరిగిన విశాఖ ఉత్తర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్య నారాయణ జయంతి వేడుకలను పురస్కరించుకొని డిసెంబర్ 19న సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి , రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, పీసీసీ అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు టి సుబ్బరామిరెడ్డి, మాజీ కేంద్రమంత్రులు, మాజీ రాష్ట్ర మంత్రులు హజరవుతున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులు సమిష్టి కృషితో సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రాహుల్ గాంధీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలో నిర్వహిస్తున్న పెద్ద కార్యక్రమం ఇదేనని కాంగ్రెస్ కార్యకర్తలకు మనోధైర్యాన్ని , నైతిక బలాన్ని ఇచ్చే కార్యక్రమంగా అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారో వాటిపై చర్చించడం భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. అఖిల బారత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా 16న బాధ్యతలు చేపడుతున్న రాహుల్ గాందీకి బాలరాజు జిల్లా తరుపున శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో భారత దేశం మరింత బలమైన బారతదేశంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఈ దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ కావాలని అకాంక్షించారు. సోనియాగాంధీ ఒక విపత్కరమైన పరిస్థితులలో పార్టీ బాధ్యతలు చేపట్టి సుదీర్ఘకాలం అధ్యక్షురాలుగా పని చేసి దేశ ప్రజలకు కావాల్సిన సాహసపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. గుజరాత్ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి దేశ ప్రధాని నరేంద్ర మోడి గుజరాత్‌లో ముఖ్యమంత్రి స్థాయికి దిగజారిపోయారని దీనితోనే బారతీయ జనతాపార్టీ పతనం ప్రారంభమైందన్నారు. విశాఖ ఉత్తర నియోజక వర్గం ఇన్‌చార్జి గుంటూరు బారతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పడు ప్రజల పక్షాన వుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు వెంకటనరసింహారావు, సతీష్‌వర్మ, వార్డు అధ్యక్షులు తుమ్మల త్రినాధ్, వెంకటరమణ, దాసు, గౌరీశంకర్, ప్రసాద్‌రెడ్డి, గొల్లకోట సుబ్బారావు తదితర్లు పాల్గొన్నారు.

# రమణానంద మహర్షి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

## ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి



విశాఖపట్నం: హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా రామయణాన్ని కించపరుస్తూ రమణానంద మహర్షి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంజనేయుడు ఒక వానరం అంటూ, వానరం ఎక్కడైనా మాట్లాడుతుందా అంటూ హేళన చేస్తూ రామాయణం, రాముడుపై అనవసర వ్యాఖ్యలు చేస్తూ హిందువుల మనోభావాలను రమణానంద మహర్షి కించపరిచారని ఆరోపించారు. అసలు ఈయనకు ఏ హక్కు ఉందని ఇలా నోరు పారేసుకుని హిందువులను కించపరిచే అధికారం ఎవరిచ్చారంటూ నిలదీశారు. రమణానంద మహర్షి ఇలా నోటికి వచ్చిందల్లా మాట్లాడితే తాము చూస్తూ ఊరు కోమని హెచ్చరించారు. శ్రీరామ్‌సేన అధ్యక్షుడు తురగా శ్రీరామ్ మాట్లాడుతూ దేవాదాయశాఖలో అవినీతి బాగా పెరిగిపోయిందని చెప్పారు.

దేవుని పేరు చెప్పి కోట్లాది ఆస్తులు కూడగట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఏసిబికి పట్టుబడిన ఆర్‌జెసి.చంద్రశేఖర్ ఆజాద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో లోకేశ్వర నందస్వామి, సత్యానందస్వామి పాల్గొన్నారు.

# డీసీఐ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

విశాఖపట్నం: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థను ప్రైవేటీకరణ చేయడం వలన దేశ, రాష్ట్ర, విశాఖ ప్రయోజనాలకు హానికరమని అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు పూర్ణామార్కెట్ దరి శుక్రవారం ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన వందల కుటుంబాలు రోడ్డున పడటమే కాకుండా విశాఖ అభివృద్ధికి కూడా గండి పడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, వై.రాజు, రమేష్, అప్పారావు, కె.నర్సింగ్, చంద్రశేఖర్, చందన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఘంటసాల 95వ జయంతి వేడుకల

## కరపత్రములు విడుదల




అనకాపల్లి : గానగంధర్వ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 95వ జయంతి వేడుకలు ఈ నెల 24వ తేదిన ఆర్‌టిసి కాంప్లెక్స్ దరి వివేకానందా ఫంక్షన్ హాలులో జిల్లాస్థాయి తెలుగు సినిమాపాటల పోటీలు, దేశభాషలందుతెలుగు లెస్స అన్న అంశము పై వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని సిద్ధార్థ సోషల్ సర్వీస్. కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభుషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిధిగా మాజీమంత్రి దాడి వీరభద్రరావు పాల్గొననున్న ఈకార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమైఖ్యఅధ్యక్షులు గొందు నవీన్ విశాఖపట్నం వారికి సామాజిక సేవాపురస్కార అవార్డుతో సత్కరించనున్నారు. వ్యాసరచన పోటీలకు ఆరోతరగతినుండి పదవతరగతివరకు విధ్యార్థినీ విధ్యార్థులు ఈ పోటీకీ అర్హులు. అలాగే సినిమా పాటలపోటీలకు అన్ని వయస్సుల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునని తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నెం. 94932 56300-8977020615గల నెం. సంప్రదించ వలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఘంటసాల గయకులు కునుతుల నారాయణరావు, సంస్థ కార్యదర్శి శీలా మానీలు, కార్యవర్గ సభ్యులు నంధ్యాల అప్పారావు , రుబ్బి మల్లేశ్వరరావు, కాంద్రేగుల ఉమా మహేశ్వర రావు, బి.ఆనందరావు, ఎల్‌వివి రామా రావు తదితరులు పాల్గొననున్నారు.


# గండిగుండంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సన్నాహాలు

**- గచ్చిబౌళి తరహాలో సకల సదుపాయాలు**

**- క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట**







విశాఖపట్నం : గచ్చిబౌళి తరహాలో విశాఖలోని గండిగుండంలో భారీ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం-సిఎంఆర్ ఇంటర్‌మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా జరుగుతున్న శుక్రవారం క్రికెట్ పోటీలకు మంత్రి గంటా ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గండిగుండంలో నిర్మించే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు సకల సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా మూడు వేల క్రీడా మైదానాలు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ప్రతీ ఏటా జర్నలిస్టులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలతో పాటు అంతర్ మీడియా పోటీలు నిర్వహించడం కూడా అభినందనీయమన్నారు. సభ్యుల సంక్షేమంతో పాటు నిరంతరం క్రీడా పోటీలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమానికి విజెఎఫ్ అధ్యక్షులు గంటా శ్రీనుబాబు అధ్యక్షత వహించగా కార్యదర్శి ఎస్.దుర్గారావు, ఉపాధ్యక్షులు నాగరాజు పట్నాయక్, నానాజీ, జాయింట్ సెక్రటరీ దాడి రవి కుమార్, కోశాధికారి పి.ఎన్.మూర్తి, కార్యవర్గ సభ్యులు మంత్రి గంటాను అభినందించారు. ఇదే వేదికపై డిప్యూటీ డైరక్టర్ మణిరామ్‌ను మంత్రి గంటా సత్కరించారు. అనంతరం బ్యాటింగ్ చేసి కాసేపు జర్నలిస్టులను ఉత్సాహపరిచారు. పోర్టు స్టేడియంలో ఉదయం ఈనాడు-ఆంధ్రజ్యోతి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈనాడు జట్టు పూర్తి స్థాయిలో పోరాట ప్రతిమ ప్రదర్శించి నప్పటికి స్వల్ప ఆధిక్యంతో ఆంధ్రజ్యోతి జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం ఆంధ్రప్రభ-ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ సాంకేతిక కారణాలతో వాయిదా పడింది.

# విజయభాను

## సంపాదకీయం

### తెలుగు మహాసభల ప్రాభవం

నేటి నుంచి భాగ్యనగరిలో ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం కావడం అపూర్వ ఘట్టం. ఐదు రోజుల పాటు సాగే ఈ భాషా సంబురాలకు దేశ విదేశాల నుంచి వేలాదిమంది సాహితీవేత్తలు, భాషాభిమానులు తరలి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎంతోకాలం కాలేదు. కానీ అనతి కాలంలోనే అన్నిరంగాల్లో సమున్నతంగా నిలువడం విశేషం. రాష్ట్రమేర్పడి మూడేం డ్లు దాటీ దాటడంతోనే తెలుగు భాషా పరిరక్షణ బాధ్యతనూ తలదాల్చి మహాసభలను నిర్వహిస్తున్నది. దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉన్న తెలుగు బిడ్డలతోపాటు, జాతీయ భాషలలో జ్ఞానపీఠ అవార్డు అందుకున్న సాహితీ మూర్తులను కూడా ఆహ్వానించి, సత్కరించాలని నిర్ణయించడం తెలంగాణ సౌహార్ద్రతకు, సంస్కారానికి నిదర్శనం. ఇప్పటి వరకు ప్రభుత్వాలు తెలు గు సభలను మొక్కుబడిగా నిర్వహించడంతో పాటు భాషా పరిరక్షణ పేర చేసిన ప్రకటనలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. కానీ ఇప్పుడు ప్రపంచ తెలుగు మహా సభల నిర్వహణకు ముందే తెలుగు భాషా పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలను తీసుకుంటున్నట్టు తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రకటన సాహితీవేత్తల నుంచి హర్షధ్వానాలను అందు కున్నది. గ్రామ స్థాయి నుంచి సచివాలయం వరకు తెలుగుకు ప్రాధాన్యం కల్పించడం మొదలుకొని, ఇంటర్ వరకు తెలుగును తప్పనిసరి చేయడం వంటి నిర్ణయాలు సాహసోపేతమైనవి. మహాసభలలో చేసే సూచనలను, సలహాలను అమలు పరుచడానికి కార్యాచరణ రూపొందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ ఐదు రోజులు మహా సభల ప్రాంగణం విద్వత్ గోష్ఠులతో కళకళలాడనుంది. పాట, కథ, కవిత, నవల, కథనం, వచనం వంటి భిన్న సాహితీ ప్రక్రియలపై చర్చోపచర్చలకు మహాసభలు వేదికవుతాయి. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ భాషా సంబురాలు సాగడంతో తెలంగాణ అంతటా పండుగ వాతా వరణం నెలకొన్నది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా భాషాభిమానాన్ని పెంచేవిగా ఉన్నాయనడంలో సందేహం లేదు. మహాసభలు ప్రకటించిన నాటి నుంచి తెలుగు సాహితీవేత్తల పట్ల సమాజంలో గౌరవం ఇనుమడించింది. రాష్ట్రంలోని వేలాది మంది తెలుగు ఉపాధ్యాయులను మహాసభల కు ఆహ్వానించడం కూడా సముచితమైన నిర్ణయం. తెలుగు ఉపాధ్యాయులకు గౌరవం లేదని కాదు. కానీ అది వారి వ్యక్తిత్వం వల్ల సిద్ధించినది. కానీ వ్యవస్థాగతంగా- పోటీ పరీక్షలు, ఉద్యోగావకాశాల దృక్కోణంలో- ఇటీవలి వరకు గణితం, ఇంగ్లీషు ఉపాధ్యాయులతో పోలిస్తే తెలుగు పండితులకు తగినంత గుర్తింపు లభించక పోయేది. ఇది గత పాలకులు పెంచి పోషించిన కుసంస్కృతి ఫలితం. దీంతో చిన్నతనం నుంచి మాతృభాష అంటే తృణీకార భావన ఏర్పడుతున్నది. కానీ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వా నాలు అందుకోవడంతో తెలుగు పంతుళ్ళ పట్ల సమాజంలో ఎనలేని గౌరవం పెరిగింది. ఒక్కసారిగా తెలుగు భాషావేత్తల పట్ల గౌరవం ఉట్టిపడే సామాజిక వాతావరణా న్ని రాష్ట్ర ప్రభుత్వం సృష్టించగలిగింది. ఐదు రోజుల పాటు మహాసభలకు హాజరై సత్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు మళ్ళా తమ బడిలో అడుగుపెట్టినప్పుడు ఇప్పటి వరకు గుర్తించని వారు కూడా వారిని మనస్ఫూర్తిగా గౌరవిస్తా రు. తెలుగు ఉపాధ్యాయులు మహాసభలు ఇచ్చిన స్ఫూర్తితో, ద్విగుణీకృత ఉత్సాహంతో భాషాబోధన కావిస్తారు. వీరి బోధనల మూలంగా మాతృభాషను గౌరవించే సంస్కారం గల కొత్త తరం ఆవిర్భవిస్తుంది. భాషా వికాసం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, గ్రామాలలో, పట్టణాలలో సామాజిక ఉత్సవం మాదిరిగా మారడం హర్షణీయ పరిణామం. సాహిత్యాభిమాని అయిన ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పరిరక్షణకు సాగిస్తున్న కృషిని గుర్తించక విమర్శించే వారు ఎప్పుడూ ఉండనే ఉంటారు.

కోట్లాది రూపాయలు పెట్టి మహాసభలు జరిపి సాధించే దేమిటని ప్రశ్నించేవారూ ఉన్నారు. కానీ రాష్ట్రం నలుమూలల నుంచి, దేశ విదేశాల నుంచి వేలాది మంది సాహిత్యాభిమానులు ఒక్క చోట చేరి చర్చిస్తే వచ్చే ఆలోచనలు, లభించే ప్రేరణ ఎన్ని కోట్లు పెట్టినా లభించదు. మహాసభలలో సాగే ఆత్మీయ పలకరింపులను కాసులతో కొలువ లేము. ఇతర రాష్ట్రాలలో మాదిరిగా కాకుండా తెలంగాణలో పండుగంటే అం దరూ కలుసుకోవడం. నలుగురు కలుసుకుంటే అదొక పండుగ. సాయంకాలం బాలికలు చెమ్మచెక్కలాడటంలో ఆనందం ఎగిసి పడుతుంది. బతుకమ్మ పండగకు వచ్చిన ఆడిబిడ్డల ముచ్చట్ల లో సంబురం పొంగిపొరలుతుంది. జమ్మి చేత పెట్టి ఆలింగనం చేసుకోవడంలో ఆత్మీయత ఉట్టిపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒకే వేదిక మీదికి తేవడం ఏమాత్రం నిష్ఫలం కాదు.

## యుక్త వయస్సు బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ



విజయనగరం : జిల్లాలోని ఐదు మండలాల్లో యుక్త వయస్సు బాలికలకు జిల్లా ఏ.పి. మహిళా సమతా సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మరక్షణ(సెల్ఫ్ డిఫెన్స్)లో శిక్షణ కార్య క్రమాన్ని శుక్రవారం నిర్వ హించారు. గుర్ల, మెంటాడ, నెల్లిమర్ల, దత్తిరాజేరు, గజపతి నగరం తదితర ఐదు మండ లాల్లో పనిచేస్తున్న వ్యాయామ శిక్షకులు, ఫిజికల్ డైరక్టర్‌లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. బండి మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి చారి ప్రసాద్ తైక్వాండోలో శిక్షణ ఇచ్చారు.

ఈ శిక్షణకు 50 మంది పి.ఇ.టి.లు, పి.డి.లు హాజ రయ్యారు. బాలికలు హింస, లైంగిక వేధింపుల నుండి రక్షణకు ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణలో నైపుణ్యం కలిగి వుండాలని ఏ.పి.మహిళా సమతా సొసైటీ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.వాణి పేర్కొన్నారు. యీ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎల్.వి.రమణ, వి.ఎస్.ఎస్.ఎస్.ఏ. కార్యదర్శి జి.తవిటయ్య, మార్షల్ ఆర్ట్స్ కోచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే సానుకూల ఫలితాలు

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఉపాధిసాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న వీసీ జి.నాగేశ్వర రావు

ఆంధ్రాయూనివర్శిటీ : సమన్వయంతో పనిచేస్తే సానుకూల ఫలితాలు వస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏయూ అకడమిక్ సెనేట్ సమావేశ మందిరంలో వర్సిటీ అధిరారులు, ఆచార్యులతో ఆచార్య నాగేశ్వర రావు సమావేశమయ్యారు. ఇటీవల వర్సిటీలో రాష్ట్రపతి పర్యటన, పూర్వవిద్యార్థుల సమావేశాలు విజయవంతంగా నిర్వహించడం పట్ల అధికారులను అభినందించారు. స్వల్ప వ్యవధిలో వర్సిటీని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడులు సందర్శించడం జరిగిందన్నారు. ఎంతో ప్రణాళికా బద్దంగా ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఆచార్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్య క్రమాలను విజయవంతం చేసారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.గాయిత్రీ దేవి, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ కార్యదర్శి ఆచార్య బి.మోహన వెంకట రామ్, డీన్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాలనిర్వహణ సక్రమంగా జరిపినే నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవడం వీలవుతుందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏయూ వాణిజ్య నిర్వహణ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వర్సిటీ ఎంబిఏ విద్యార్థులు వర్సిటీ నిర్వహించే కార్యక్రమంలో అందిస్తున్న సహకారం నిరుపమానమన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు, విభాగాధిపతి ఆచార్య జి.సత్యనారాయణ, ఆచార్య బి.మొహన వెంకట రామ్, ప్లేస్‌మెంట్ అధికారి ఆచార్య ఎన్.సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనలలో పాల్గొని, సమన్వయం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రధానం చేశారు. అనంతరం డి మార్ట్‌లోఎంపికైన ఏయూకు చెందిన ఇద్దరు విద్యార్థులకు నియామక పత్రాలను ప్రధానం చేశారు. రిటైల్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పి.బి గోపిక్రిష్ణ, సిహెచ్ ప్రవీణలు 2.75 లక్షల వార్షిక వేతనంతో డిమార్ట్ సూపర్ మార్కెట్ సంస్థలో ఉపాధిని సాధించారు.

## సుధకు కేంద్రీయ విద్యాలయ జాతీయ పురస్కారం



విశాఖపట్నం : విశాఖకు చెందిన కేంద్రియ విద్యా లయం ఉపాధ్యాయురాలు జె.సుధ జాతీయ పురస్కారం అందుకున్నారు. కంటెంట్ కీ ఫర్ కమ్యూనికేషన్, విలువ ఆధారిత విద్య అంశాల్లో విశేషమైన ప్రతిభ చూపినందుకు గానూ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో డిసెంబరు 15 తేదీన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రీనారే (ఐఎఎస్) చేతుల మీదుగా అందుకున్నారు.

## అచ్యుతాపురంలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తులపై విజిలెన్స్ దాడులు



అచ్యుతాపురం: మండల కేంద్రమైన అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్న చోడపల్లి గ్రామంలో శుక్రవారం అక్రమంగా గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తులపై విజిలెన్స్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు తమకు అందిన సమా చారం మేరకు అచ్యుతాపురంలో పలు చోట్ల తణికీలు నిర్వహించారు. ఈ తణికీల్లో 2 చోట్ల అక్రమంగా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ బండల నుండి 5 కెజీల చిన్న సిలిండర్లకు రీఫిల్లింగ్ చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు విజిలెన్స్ సిఐ నారీమణి తెలిపారు. విజిలెన్స్ సిఐ మాట్లాడుతూ 18 పెద్ద సిలిండర్ల నుండి 34 చిన్న సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేస్తుండగా పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించామని అలాగే స్థానిక ఆర్‌ఐకి సమాచరం అందించామన్నారు. ఎవరైనా అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తే విజిలెన్స్ అధికారులకు గాని సివిల్‌సప్లై అధికారులకు గాని సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే అక్రమంగా ఇసుక ర్యాంప్‌లు, గుట్కాలు, గ్రావల్ త్రవ్వకాలుపై సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తణికీల్లో విజిలెన్స్ ఎస్ఐ రమేష్, ఆర్ఐ విజయలక్ష్మి, విఆర్ఓ నాయుడు తదితరులు ఉన్నారు.

## కవి సమయం

### అమ్మ ఒడి కన్న బడి మిన్న

ప్రతి మనిషికి అమ్మే తొలి గురువు. అయితే మనం అమ్మ ఒడిలో కొన్ని విషయాలనే తెలుసుకోగలుగుతాం. అదే విద్య నేర్పించే బడిలో మరిన్ని విషయాలను తెలుసుకుంటాం. నేర్చుకుంటాం. బడిలో నేర్చుకునే విద్య మన భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. కాబట్టి అందరూ బడికి వెళ్ళాలి. అయితే ఇప్పటికీ మన దేశంలో బడికి వెళ్ళని, వెళ్ళలేని పిల్లలు చాలామంది వున్నారు. కేవలం మన పిల్లలే కాదు. బడికి వెళ్లకుండా వుండే పిల్లల తల్లితండ్రులకు నచ్చచెప్పి వారి పిల్లల్ని బడికి పంపించేలా చూడాలి. ప్రభుత్వం చేసిన చట్టాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలు గురించి వివరించాలి. అలా చేయడం మన అందరి సామాజిక బాధ్యత. అందరూ ఈ దిశగా తమ వంతు కృషి చేస్తారని ఆశిస్తూ ఓ శతక పద్యాన్ని ఉదహరిస్తున్నాను.

'అమ్మ ఒడిని వదిలి అడుగిడ లోకాన
భవిత దారి కలదు బడిని చేర
అమ్మ ఒడిని మించు అందాల ఒడి బడి
కంటి నలుసుర పులికంటిమాట!'

...రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : త్రయోదశి ఉ.7.13; అనూరాధ తె.4.30; ఉ.వ.6.49ల 8.33

శనివారం 16-12-2017

**మేషం** : స్థిరాస్తి అమర్చుకోవాలనే మీ కోరిక నెరవేరుతుంది. వ్యాపారాల్లో నూతన భాగస్వామికులను చేర్చుకునే విషయంలో పునరాలోచన అవసరం. ఎంతో కొంత పొదుపు చేద్దామన్న మీ యత్నం ఫలించక నిరుత్సాహం చెందుతారు. మీ సంతానం ఉన్నతి కోసం శ్రమిస్తారు. ప్రయాణాలు అనుకూలం. **వృషభం** : రాజకీయాల వారు కార్యకర్తల వల్ల సమస్యలను ఎదుర్కొనక తప్పదు. ఉద్యోగస్తుల కష్టాన్ని, చిత్తశుద్ధిని అధికారులు గుర్తిస్తారు. బ్యాంకుల నుంచి పెద్దమొత్తం ధనం డ్రా చేసే విషయంలో మరొకరి సాయం తీసుకోవటం క్షేమదాయకం. పట్టుదలతో శ్రమిస్తే అసాధ్యమనుకున్న పనులు పూర్తి కాగలవు. **మిథునం** : పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తాలకు ఒత్తిడి తప్పదు. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ రంగాల వారి నుంచి అభ్యంతరా లెదురవుతాయి. హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు ఒత్తిడి, చికాకులు తప్పవు. **కర్కాటకం** : ఉద్యోగస్తులకు రావలసిన అలవెన్సుల మంజూరవుతాయి. లౌక్యంగా వ్యవహరించి ఒక అవకాశాన్ని మీకు అనుకూలంగా మలుచుకుంటారు. ఏజెంట్లు, బ్రోకర్లకు, శ్రమ, పనిభారం మినహా ఆశించిన ప్రతిఫలం లభించదు. ఖర్చులు బాగా పెరిగే అస్కారం ఉంది. శారీరక శ్రమ వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. **సింహం** : దీర్ఘకాలిక పెట్టుబడులు, వ్యాపారాల విస్తర ణలు అనుకూలిస్తాయి. సమయానికి ధనం సర్దుబాటు కాకపోవటంతో ఒకింత ఒడిదుడుకులు తప్పవు. మీ శ్రీమతికి మీరంటే ప్రత్యేకాభిమానం కలుగుతుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. **కన్య** : ప్రింటింగ్ రంగాల వారికి సమర్థులైన పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో సత్సంబంధా లేర్పడతాయి. స్థిరాస్తి అమ్మకం విషయంలో పునరాలోచన అవసరం. తలపెట్టిన పనులు అర్థాంతంగా ముగించాల్సి వస్తుంది. మిత్రుల ద్వారా ఆశ్చర్యకరమైన విషయాలు గ్రహిస్తారు. **తుల** : నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. వీలైనంత వరకూ మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. కొంతమంది మీ విషయాల్లో అతిగా వ్యవహరించి ఇబ్బందులకు గురి చేస్తారు. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. దైవ, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. **వృశ్చికం** : మీ హోదాకు తగినట్టుగా ధనం వెచ్చించాల్సి ఉంటుంది. రావలసిన ధనం వసూలు కాగలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు. ప్రింటింగ్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. స్త్రీలకు షాపింగ్ వ్యవహారాల్లో మెళుకువ అవసరం. **ధనుస్సు** : పాత బాకీలు అనుకోకుండా వసూలవుతాయి. నూతన పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. విదేశీ వస్తువులపై ఆకర్షితు లవుతారు. ఉమ్మడి, ఆర్థిక వ్యవహారాల్లో ఒక నిర్ణయానికి వస్తారు. మీ యత్నాలకు సన్నిహితుల సహాయ సహకారాలు లభిస్తాయి. **మకరం** : బంధువుల ఆకస్మిక రాక కొంత ఇబ్బంది కలిగిస్తుంది. తరుచు దైవ, పుణ్య కార్యాల్లో పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలించవు. వాహన చోదకులకు ఊహించని సమస్యలెదురవుతాయి. బ్యాంకు వ్యవహారాలలో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. స్త్రీలకు పనిభారం అధికం. **కుంభం** : స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కళా, సాంస్కృతిక ఆరాధన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ఖర్చులు, తప్పనిసరి చెల్లింపుల వల్ల ఇబ్బందు లెదుర్కుంటారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిదికాదు అని గమనించండి. విద్యార్థినులలో మందకొడితం అధిక మవుతుంది. **మీనం** : ఇతరుల విషయాల్లో అతిగా వ్యవహరించటం వల్ల మాటపడక తప్పదు. షేర్ల క్రయ విక్రయాలు లాభదాయ కంగా ఉంటాయి. చిట్స్ వ్యాపారులకు ఖాతా దారుల నుంచి చికాకులు తప్పవు. కార్య సాధనలో మొండిధైర్యం, పట్టు దలతో



## పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు

### సంకీర్తన

**భారత** దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్థం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మథనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకునేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవించాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకు రాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహినిగా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దుఃఖిస్తాడు. శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తెగా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మా యినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుం ది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు. పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుండేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# శరవేగంగా మండల పరిషత్‌కు కొత్త భవనం



నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం భవనం

నర్సీపట్నం : నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయానికి కొత్త భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలో కొత్త భవనం సమకూరనుంది. రూ.1.10కోట్ల ఖర్చుతో తలపెట్టిన భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 50శాతం పనులు పూర్తయ్యాయి. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణ లోనే నూతనంగా భవనం నిర్మిస్తున్నారు. ప్రస్తు తం పాత భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. తరచూ మర మ్మత్తులు చేసి ఈ భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. తరచూ మర మ్మత్తులు చేసే ఈ భవనంలోనే కాలం గడుపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్త భవనం పనులు చేపట్టారు. కొత్త భవనంలో అన్ని వసతులతో కూడిన సమావేశ మందిరం, ఎంపిడిఒ, ఎంపిపిల కోసం ప్రత్యేక గదులు నిర్మించనున్నారు.

# ప్రారంభమైన వంతెన పనులు



వంతెన పనులు చేస్తున్న కూలీలు

కొయ్యూరు : మండలంలోని బట్టపనుకుల గన్నెర్లపాలెం వంతెన పనులు ప్రారంభించారు. వర్షాల కారణంగా కొద్ది రోజులు పనులు నిలిపివేశారు. ఇటీవల వర్షాలు తగ్గడంతో పనులు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి పనులు మొదలుపెట్టారు. అయితే నాటి నుంచి వర్షం కావడంతో ఇక్కడ వేసిన సామగ్రి కూడాపోయింది. తాజాగా పనులు చేపట్టారు. 15 రోజుల పాటు వర్షాలు లేకుండా ఉంటే పునాది పనులను పూర్తి చేయనున్నారు. పునాది నుంచి మూడు రకాల ఇనుప ఊచలను వేస్తున్నారు. ఇది పూర్తయితే సిమెంట్ కాంక్రీట్‌ను వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే 15 రోజుల సమయం పడుతుంది. దీంతో పాటు ఇనుప ఊచలను కత్తిరించేందుకు అవసరమైన విద్యుత్ కూడా లేదు. దీంతో కొన్ని సార్లు పనులకు అంతరాయం ఏర్పడు తోంది. రూ.కోటి నిధులతో రోడ్డు, వంతెన పనులను చేపట్టారు. రోడ్డు పనులు చాలా వరకు పూర్తయ్యాయి. వంతెన పూర్తయితే మొత్తం బిటిని వేయాలని చూస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న చోట నీరు అధికంగా ఉంది. దీనినిఇంజన్ ద్వారా తోడుతున్నారు. రోజూ కూడా ఇంజన్‌తో నీటిని తోడుతున్నారు. ధరలు పెరిగిపోవడంతో వంతెనను కేటాయించిన రూ.40లక్షలు చాలని పరిస్థితి వచ్చింది.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వేతనాలు జమ

రోలుగుంట : మధ్యాహ్న భోజన నిర్వాహకులందరికి అక్టోబర్ నెల జీతం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని ఎంఇఒ కిరణ్మయి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భోజన నిర్వాహకులు సహాయకులకు కూడా వచ్చాయన్నారు. భోజన పెట్టుబడుల నిధులు కూడా మంజూరు అయ్యాయన్నారు. ఎవరికైనా జమ కాకపోతే తమ కార్యాలయంలో వెంటనే సంప్రదించాలని కోరారు.

## పట్టణంలో జోనల్ కమిషనర్ ఆస్తి పన్నులపై స్పెషల్ డ్రైవ్

అనకాపల్లి : పట్టణంలో పూడిమడక రోడ్డులో ఆస్థి పన్నుల వసూళ్లకు జోనల్ కమీషనర్ షేక్ సుభానీ తమ సిబ్బందితో కలిసి వసూలు చేసారు. పేరుకుపోయి ఉన్న ఆస్థిపన్ను యాజమానుల వద్దకు స్వయంగా వెళ్లి తక్షణమే పన్నులు చెల్లిం చాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శతశాతం పన్నులు వసూలుకు తమ సిబ్బందికి పట్ణణ ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే అదే రోడ్డులో ఆస్తి పన్నులు బకాయిలు ఉంటూ భవన నిర్మాణం చేపట్టిన యాజమానిని ముందు ఆస్తి పన్ను చెల్లించి భవన నిర్మాణ పనులు చేపట్టాలని హుకుం జారీ చేశారు. దీంతో ఆ భవన యాజమాని చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలుని చెల్లించి భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మళ్ల శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, రామయ్య పాల్గొన్నారు.

# పల్లెనిద్రతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న డిపిఒ కృష్ణకుమారి

నాతవరం : పల్లెనిద్ర కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం అవుతాయని డిపిఒ వి.కృష్ణకుమారి అన్నారు. గురువారం రాత్రి ములగపూడి పంచాయతీ ఎం.బెన్నవరం గ్రామంలో పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కనకారావు, ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు, సర్పంచ్ కృష్ణవేణి ఉన్నారు.

# నీతిఆయోగ్ నివేదికపై కలెక్టర్ సమీక్ష



విజయనగరం : జిల్లా యంత్రాంగం తరపున నీతిఆయోగ్ సంస్థకు సమర్పించవలసి వున్న నివేదికపై జిల్లా అధికారులతో కలెక్టర్ వివేక్ యాదవ్ శుక్రవారం సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 115 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక పరిశీలకులను నియమించి ఆయా రంగాల్లో వెనుకబాటు తనానికి గల కారణాలు గుర్తించి జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక నివేదికలను రప్పించుకుంటోంది. దీనిలో భాగంగా జిల్లాకు కర్ణాటక కేడర్ ఐ.ఎ.ఎస్. అధికారి బి.హెచ్.అనిల్‌కుమార్‌ను ప్రత్యేక పరిశీలకులుగా నియమించింది. ప్రత్యేక పరిశీలకుని ద్వారా కేంద్ర ప్రభుత్వానికి జిల్లా అభివృద్ధిపై నివేదిక సమర్పించాల్సి వున్న నేపథ్యంలో కలెక్టర్ పలు శాఖల అధికారులతో చర్చించేందుకు యీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన యీ సమావేశంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొని జాతీయ స్థాయిలో ఆయా ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పరిస్థితి దీనిని మెరుగు పరిచేందుకు చేపడుతున్న చర్యలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసేందుకు అమలు చేస్తున్న వ్యూహాలపై వివరిం చారు. జిల్లా విద్య, వైద్యం, మౌళిక వసతులు, పేదరిక నిర్మూలన, జీవనోపాధుల కల్పన, వ్యవసాయం వంటి రంగాల్లో జాతీయ స్థాయి సగటుకంటే దిగువన ఉండటంతో ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా రంగాల్లో వృద్ధి సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. విద్యాశాఖకు సంబంధించి బడియీడు పిల్లలు మధ్యలేనే బడి మానివేయడాన్ని తగ్గించడం, పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి మాతాశిశు మరణాలు తగ్గింపు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రావికమతం : చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారు, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు డిసెంబరు 1 నుండి 31వరకు అవగాహన మహోత్సవాలు నిర్వహిస్తున్నామనిచైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ గణేష్ అన్నారు. నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదంతో విస్తృత ర్యాలీలు, సమావేశాలు నిర్వ హించి ఎవరు హెచ్‌ఐవి బారిన పడకుండా అవగాహన కల్పిస్తు న్నామన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ల స్కీమ్ గ్రామాలలో అధికారులను, పాఠశాల విద్యార్థులను, డ్వాక్రా సంఘాలను, యువతకు గ్రామ ప్రజలకు చేస్తున్నామన్నారు. అనంతరం దొండపూడి గ్రామంలో ప్రచారం చేసి ప్రజ్ఞ్ఞి చేశారు.

ఈ కార్యక్రమంలో దొండపూడి సర్పంచ్ జి.తాతబాబు, జి.రాము నాయుడు బేరా సత్తిబాబు, జి.నాని, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# నేడు గౌరీపరమేశ్వరుల మహోత్సవం



అనకాపల్లి : పట్టణంలో కుంచావారి శ్రీ గౌరీపరమేశ్వరుల మహొత్సవం శనివారం గణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని ఉత్సవ కమిటి చైర్మన్ పాండ్రంకి సత్యారావు, కార్యదర్శి కోరుకొండ సాంభశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. 200సం॥ సుదీర్ఘ చరిత్ర గలిగిన వినూత్న రీతిలో పలు సాంస్కృత కార్యక్రమాలతో కనులు మిరిమిట్లు కొల్పే విధ్యుత్ కాంతులతో నిర్వహించే ఈ మహొత్సవానికి ముఖ్యఅతిథిలు గా రాష్ట్ర మంత్రివర్యులు గంటా శ్రీనివాస రావు, ఎమ్ఎల్ఎ పీలా గోవింద సత్య నారాయణ, ఎంపిముత్తంశెట్టి శ్రీనివాస రావు, ఎమ్ఎల్‌సి పప్పల చలపతిరావు, మాజీ మంత్రి వర్యులు కొణతాల రామ కృష్ణ, దాడి వీరభద్రరావు, భీమిలి తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి పరుచూరి భాస్కర రావు పాల్గొంటారు. ఉత్తరాంధ్ర పేరు గాంచిన మందుగుండు సీతారామయ్య తయారుచేయబడిన భారి భాణాసంచా తోపాటు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జైచిరంజీవ మెగా డ్యాన్స్ షో వన్-వే- ట్రాఫిక్ డౌన్ వద్ద శిల్పి కామధేనువు ప్రసాద్ నడిగెట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న డ్యాన్స్ ఎటాక్ , చేపల బజారు వద్ద పవర్ డ్యాన్ నైట్ , మెయిన్‌రోడ్డులో బంగారం వర్తకుల ఆర్ధిక సహయంతో నిర్వ హిస్తున్న రేలా రె రేలా దుమ్ములేపు డ్యాన్ షో , మెయిన్‌రోడ్డులో సీతారామకళ్యాణం బుర్రకథ తదితర భారీ స్టేజ్ ప్రోగ్రాంలు తోపాటు నేల వేషాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అలాగే ఆదివారం గౌరీపరమేశ్వరుల అనుపు మహొత్సవం పట్టణ పురవీధుల గుండా ఊరే గింపు అతివైభవంగా జరుగు తుందని, పట్టణ ప్రజలు ఈ మహొత్సవంలో పాల్గోని అమ్మ వారికి కృపకు పాత్రులు కాగలరని ఉత్సవకమిటీసభ్యులు కోరారు.

# నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 12 కోట్లు మంజూరు

**-మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు -ఎం.అలమండ-తారువ రోడ్డుకు శంకుస్థాపన**



దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గంలో ఎనిమిది రోడ్లు నిర్మాణానికి 12 కోట్లు రూపా యలు నిధులు మంజూరు అయ్యాయని టి డి పి మాడుగుల నియోజక వర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామా నాయుడు తెలిపారు. మండ లం లోని ఎం.అలమండ-తారువ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ రోడ్డు కు నాబార్డ్ నిధులు కింద 1 కోటి 80 లక్షలు మంజురు అయ్యాయి.

ఈ సంబర్భంగా అయన మాట్లడుతూ నియోజకవర్గంలో 90 శాతం త్వరితగతిన పూర్తి చూస్తామన్నారు. ఈ కార్య క్రమంలో జడ్పీటిసీ గాలి వరలక్ష్మి, బండారు రామారావు సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, రావాడ సింహాద్రి నాయుడు, పూడి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గులారీలుపై భగ్గుమన్న బొగ్గు లారీల బాధితల పోరాట కమిటీ

## బొగ్గు లారీలు అపాలని సంతకాల సేకరణ



పరవాడ:పరవాడమండలంలోదూళి కాలుష్యం, బొగ్గు లారీలరవాణానుని నిలుపుదల చేయాలని సంతకాయల సేకరణ ఈకార్యక్రమాన్నిమెదటిరోజుమంగళవారముపరవాడసర్పంచ్ చుక్కరాము నాయుడు చేతులు మీదగా పరవాడ సంతబయలు ప్రారంబించారు.రెండోవరోజుపరవాడసభ్ స్టేషన్ జంక్షన్ వద్ద ఈసంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మూడోరోజు పరవాడసినిమాహల్ జంక్షన్ వద్దఈసంతకాలసేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. నాల్గోవరోజున ఉటగెడ్డసెంటర్ వద్దఈకార్యక్రామాన్ని చేపట్టారు. ఈసందర్భంగా జరిగిన సభలో పోరాట కమిటి నాయకులుమాట్లడుతూబొగ్గులారీలుదూళికాలుష్యంతోపరవాడప్రజలందరూనరకయాతనపడతున్నారని,అధికార్లునిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారనిఅన్నారు.నిభంధనలకువిరుద్ధంగాఅధికలోడుతో అనుమతిలేనివాహనాలుపైఅధికారులుసైతమునోరువిప్పడములేదనిఅన్నారు.నిత్యంప్రమాదాలుజరిగిఅనేకమందిక్షేత్రగాతులుఅవుతున్నారు.ప్రభుత్వముఅధికారులు,ప్రజాప్రతినిధులు సమస్యపై స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృక్తము చేస్తా మన్నారు.ఈ కార్యక్రమంలోపరవాడసర్పంచ్ చుక్కరామునాయుడు, బొగ్గులారీలబాధితలపొరాటకమిటికన్వీనర్ మాణిక్యం, పరవాడ ఎమ్ పిటిసి సిరపురపుఅప్పల నాయుడు, జనసేన సేవాధాళ్ సభ్యులు మోటూరుసన్యాశి నాయుడు, వెన్నెల సన్యాశిరావు, స్కూల్ కమిటిచైర్మన్ పైలహరేష్ ,వైసిపియూత్ ప్రెసిడెంట్ పెదిశెట్టిశేఖర్ ,జనసేనసేవాదళ్ సభ్యులు బొద్దపు శ్రీనువాసు కాసులు, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్య నారాయణ, బొద్ధపుచిన్నారావు,కెయస్ఎ రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

## రేషన్‌కార్డు పడిపోయింది

యానాం కోనా వెంకటరత్నం నగర్‌కు చెందిన చంపటి క్రిష్ణంరాజు S/o. వెంకటపతిరాజు(లేటు)కు చెందిన రేషన్‌కార్డు నెంబర్ 463627 పడిపోయింది. ఈ నెల 10వ తేదీన కోన వెంకటరత్నం నగర్ ఇంటివద్ద నుండి మోటారు వాహనంపై వస్తుండగా ఫెర్రీరోడ్డు మార్గంలో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికినయెడలా ఈ క్రింది చిరునామాకుతెలియజేయ వలసిందిగా కోరుతున్నాము.

చంపటి క్రిష్ణంరాజు,
S/o. వెంకటపతిరాజు (లేటు),
డోర్ నెంబర్ 7-17-63,
కోనా వెంకటరత్నం నగర్,
ఫెర్రీరోడ్డు, యానాం.
ఫోన్ నెంబర్లు
9505044014, 955051246

## రేషన్‌కార్డు పడిపోయింది

యానాం యుకెవి నగర్‌కు చెందిన కొప్పుల జేష్టకుమారి W/o. అన్నవరం (లేటు) చెందిన రేషన్‌కార్డు నెంబర్ 5770 పడిపోయింది. ఈ నెల 8వ తేదీన ఆఫీసు నిమిత్తం జెరెక్స్ తీయించుటకు వస్తుండగా కనకాలపేట ఏటిగట్టు రోడ్డుమార్గం మధ్యలో పడిపోయింది ఇది ఎవరికైనా దొరికినయొడలా ఈ క్రించ చిరునామాకు తెలియగోరుతున్నాం.

కొప్పుల జేష్టకుమారి,
W/o. అన్నవరం (లేటు),
డోర్ నెంబర్ 9-2-152,
యుకెవి నగర్, యానాం.
సెల్ నెంబర్ 9701166540.

# ఫేకర్ కార్మికుల సమస్యపై కమిటీ ఏర్పాటు

**కార్మికులు, యాజమాన్య ప్రతినిధులతో కలెక్టర్, ఎస్.పి. చర్చలు - పాల్గొన్న మాజీ మంత్రి డా.మృణాళిని**



విజయనగరం : జిల్లాలోని గరివిడిలో ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ (ఫేకర్)లో కార్మికులు, యాజమాన్యం మధ్య ఉన్న లోడింగ్ వివాదం పరిష్కారానికి ఒక కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వివేక్ యాదవ్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి.పాలరాజు, చీపురుపల్లి శాసనసభ్యురాలు డా.కిమిడి మృణాళిని, కార్మిక అధికారులు, యాజమాన్య ప్రతినిధులు, కార్మిక ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో ఈ మేరకు ఒక నిర్ణయం తీసుకున్నారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ అధ్యక్షతన ఏర్పడే యీ కమిటీలో విజయనగరం రెవిన్యూ డివిజనల్ అధికారి, ఫేకర్ యాజమాన్యం తరపున ప్రతినిధి, కార్మికుల తరపున ప్రతినిధిగా చిట్టియ్య అనే కార్మికుడు సభ్యులుగా వుంటారు. ఈ కమిటీ పలు అంశాలపై అధ్యయనం చేసి జిల్లా అధికార యంత్రాంగానికి ఒక నివేదిక అందిస్తుంది. యీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఫేకర్ యజమాని షరాఫ్‌తో తదుపరి చర్చలు జరపాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, యాజమాన్యం యీ సమస్యపై తమ వాదనలు వినిపించారు. ఉత్పత్తి జరిగిన మెటీరియల్‌ను లోడింగ్ చేసేందుకు లారీలు సమకూర్చాలని కార్మికులు కోరగా, ట్రాక్టర్లు మాత్రమే సమకూర్చగలమని యాజమాన్య ప్రతినిధులు చెప్పారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 122 మందికి ప్రతిరోజూ పని కల్పించాలని కార్మికులు కోరారు. రోజుకు ఒక్కో కార్మికుడు కనీసం ఆరు టన్నులు లోడింగ్ చేస్తేనే యాజమాన్యానికి గిట్టుబాటు అవుతుందని యాజమాన్య ప్రతినిధులు చెప్పారు. ప్రస్తుతం బయటి నుండి వచ్చిన కార్మికులు రోజుకు పది టన్నులు లోడ్ చేయగలుగుతున్నారని యాజమాన్య ప్రతినిధులుగా హాజరైన జనరల్ మేనేజర్ కె.వి.ఎస్.ఎస్. ఎన్.మూర్తి, సీనియర్ మేనేజర్ కమలాకర్, సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్.రామకృష్ణ తదితరులు వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్, ఎస్.పి. పాలరాజులు స్పందిస్తూ కార్మికులు ఒక రోజులో ఎంత లోడింగ్ చేయగలరనే విషయంపై అధ్యయనం చేసి నివేదించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనిపై ఎం.ఎల్.ఏ. డా.మృణాళిని కూడా సానుకూలంగా స్పందించారు. కార్మికుల పట్ల సానుకూల దృక్పథంతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని యాజమాన్య ప్రతినిధు లకు సూచించారు. గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోని పలు గ్రామాల్లో తన పర్యటన సందర్భంగా ఎందరో ఫేకర్ కార్మికులు పనిలేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించానని దీనికి ఒక పరిష్కారం చూపాల్సి వుందన్నారు. కార్మికులు లారీల ద్వారా లోడింగ్ చేసస్తే ఎన్ని టన్నులు లోడింగ్ చేయగలరు, ట్రాక్టర్ల ద్వారా అయితే ఎన్ని టన్నులు లోడింగ్ చేయగలరనే అంశాల్ని కమిటీ అధ్యయనం చేససి నివేదిస్తుందని కలెక్టర్ చెప్పారు. ప్రతి కార్మికుడు రోజుకు ఆరు టన్నుల మెటీరియల్ లోడింగ్ చేయగలరా లేదా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో గరివిడి ఎంపిపి బలరాం, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.వి.జె.మురళి, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటరత్నం, సహాయ కార్మిక కమిషనర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



యానాం : యానాం పోలీస్‌లకు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి అర్జీదారులకు న్యాయం చేయాలని లీగల్ అథారిటీ చైర్మన్ యానాం సబ్‌జడ్జి ఎఎస్ హరిహరకుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం సర్వశిక్షాభియాన్ సమావేశపు హాలులో పుదుచ్చేరి న్యాయశాఖ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా వ్యవహరిస్తున్న రుద్రకుమార్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ చట్టాలపై పోలీస్‌లు పూర్తి అవగాహన కల్గిఉండాలన్నారు. న్యాయంకోసం వచ్చే అర్జీదారులకు త్వరతిగతిన న్యాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. చట్టాలపై అవగాహన లేకపోతే అర్జిదారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. న్యాయం అందించకపోతే దీనికి అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. చట్టాలలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వాటిపట్ల పూర్తి అవగాహన కల్గిఉండాలన్నారు. అనేక అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో యానాం ఎస్‌పి నితిన్‌గోహల్, సిఐ కైదీయాజం, ఎస్‌ఐలు వి. శివకుమార్, కట్టా సుబ్బరాజు, బడుగు కనకారావు, బడుగు అల్ఫన్స్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

# లింగ వివక్షత పై గ్రామస్థాయి శిక్షణా కార్యక్రమం




భీమునిపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో లింగ వివక్షతపై గ్రామస్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా ఎం.పి.పి. యరబాల క్రిష్ణవేణి , ప్రత్యక అతిదిగా ఎం.పి.డి.ఓ కె.హరిప్రసాద్, నేచర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఇ.ఎన్.రత్నలు హాజరు అయ్యారు. నేచర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జు.చీ..రత్న మాట్లాడుతూ లింగ వివక్షత చిన్నతనం బాలికలదశ నుండి మహిళలకు చదువు పుట్టిక, త్వరగా వివాహము చెయడం ఇలా అన్ని విషయాల్లో మహిళలకు వివక్షత జరుగుతుంది. మహిళల హక్కులు, విష్యంలో చిన్నచూపు చూస్తున్నారని. కావున గ్రామస్థాయి నుండే లింగ వివక్షత రూపుమాపే బాధ్యత, సర్పంచులు, సక్రెటరిలు, వార్డు మెంబెర్స్ ఎస్.హెచ్.జి. వెలుగు సిబ్బంది చొరవ చూపించాలని అన్నారు కోఆర్డినేటర్ బి.విజయకుమారి మాట్లాడుతూ మహిళలకు నిర్ణయదికారం, ప్రతీ విషయంలో మహిళలు నిర్ణయాలు తీసుకొని బాగసామ్య హక్కును చూపించాలని కోరారు. ఎం.పి.డి.ఓ. హరిప్రసాద్ మాట్లాడుతూ మహిళలపై వివక్షత గురించి మండల స్థాయి శిక్షణ ఇంతక ముందు జరిగినది ఇప్పుడు ఎస్.హెచ్.జి శిక్షణలు జరుపుతున్నాము. లింగ వివక్షత అనేది గ్రామస్థాయి నుండి నిర్మూలన జరగాలి అందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అదికారులు, వెలుగు, ఏస్.హెచ్. జి, వారు ఈ శిక్షణలో తెలుసుకొని గ్రామస్థాయి నుండి లింగ వివక్షత రూపు మాపాలని కోరుచున్నానని అన్నారు. ముఖ్య అతిది ఎం .పి.పి. యరబాల క్రిష్ణవేణి మాట్లాడుతూ లింగ వివక్షత పై గ్రామస్థాయి లో ఇటువంటి శిక్షణ ఇవ్వడం చాల మంచి కార్యక్రమం అని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న నేచర్ క్రియశీల సంస్థ వారికి అభినందనలు తెలిపారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా, పుణ్యావచనం అమ్మవారికి ముల మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలను ఆలయ ఈవో మారెడ్డి.జితేంద్ర హోమ గుండంలో వేసారు.పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎసి ఈరంకి.జగన్నాధరావు, పిఆర్వోతులా.రాముడు, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

అనంతరం భక్తులకు తీర్ద,ప్రసాదాలు అందజేసారు.

## విద్యార్థులకు యూనిఫారంలు అందచేత

తాళ్లరేవు : నీలపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల చిన్నారులకు స్థానిక సర్పంచ్ వైఎస్‌ఆర్‌సిపి నాయకురాలు రేవు మల్లీశ్వరి స్కూల్ యూనిఫారంను పంపిణీచేశారు. పాఠశాల ఆవరణలో 190 మంది చిన్నారులకు ఎంఇఒ ఎం మంగయ్యమ్మలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. రాజేశ్వరి, సిఎస్‌ఆర్ కృష్ణమూర్తి, సుబ్బారావు, జి. విష్ణు, మానస, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నేత్ర పరీక్షలు

యానాం : వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కాకినాడకు చెందిన నైనా ఆసుపత్రి వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించారు. సర్వశిక్షాభియాన్ కోఆర్డినేటర్ కమిడి ప్రభాకర్‌రారవు ఆధ్వర్యంలో కమలానెహ్రూ బాలిక ఉన్నత పాఠశాలలో 350 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 94 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారని ఈ నెలాఖరుకు వారిని కాకినాడకు తీసుకువెళ్ళి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోడ్లు అందిస్తామని ప్రభకారరావు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కాలే సాయినాధ్, పిల్లి రుద్రరామ్‌గోపాల్, పువ్వల రాజారామోహనరావు, బొబ్బిలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి



భీమునిపట్నం : భీమిలి డివిజన్ టి.డి.పి. అధ్వర్యంలో అద్యక్ష, కార్యదర్శులు గంటా.నూకరాజు, గాడు.సన్యాసి నాయుడు అద్యక్షతన స్థానిక బీచ్ వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు 65 వ వర్ధంతి సందర్బంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు ఆంద్ర రాష్ట్ర సాధనకోసం ఆమరణ దీక్ష బూని బారతదేశం లో చిర స్థాయిగా నిలిచిన మహనీయుడు అని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పెంటపల్లి.యోగి , జి.పోలిరాజు,కె.అప్పలనాయుడు వూళ్ళ.దుర్గారావు, వి.కోదండ, దాసరి.వెంకటేష్, ఎం.సంజీవ్, శిరిగుడి. సూర్యనారాయణ, ఆదర్శ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు బాగం.గోపాలరావు, అప్పికొండ. రాజు, కె.అప్పన్న, కంచెర్ల.కామేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్దంతి వేడుకలు




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక వహానాల వీధిలో ఉన్న అమరజీవి పొట్టి.శ్రీరాములు వర్దంతి వేడుకలను వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు ముందుగా అక్కడ ఉన్న పొట్టి.శ్రీరాములు విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నేతి.బాబి,రాజేష్,రమేష్, బోనగిరి.శ్రీనివాస్ తదితరులు పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు అర్పించారు.

## నేడు సత్యదేవుని సన్నిధిలో మెట్లోత్సవం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ప్రతీ సంవత్సరం ధనుర్మాస ప్రారంభ సూచికగా నిర్వహించే మెట్లోత్సం నేడు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం 8 గంటలకు స్వామివారి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి 8-30 ని.ల నుండి మెట్టు, మెట్టుకు పసుపు, కుంకుమ వ్రాసి హారతులు ఇస్తారు. ఈ మెట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయ ఈవో ఎమ్.జితేంద్ర తగిన ఏర్పాట్లు చేసారు. ఈ మెట్లోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొంటారు.

# చదరంగం విజేతలకు అభినందనలు



యానాం : స్థానిక పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనభరిచినందుకు పాఠశాల యాజమాన్యం విజేతలు అభినంవదించింది. ఈ సందర్బంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో యానాం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ చింతి వెంకట రామయ్య విజేతలను సత్కరించారు. అండర్ 13 15లో ప్రతిబ కనభరిచిన అయుషా రెహ్మాన్, విరజా దుర్గా, పెదపాటి నీలిమ, బాల సూర్య చంద్ర, వజ్రపు అక్షయ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి. బాలాజీ సుధాకర్, అనాల వీరభద్రరావు, పి. తాతబ్బాయి, సావిత్రి అండాళ్, సిఇటి బజాజ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురం కేబుల్‌వారు అధిక వసూళ్ళను మానుకోవాలి

**- శీరం రామజోగి**


పిఠాపురం : జిల్లాలోఎక్కడాలేని విధంగా పిఠాపురంలో కేబుల్ టివి ఆపరేటర్లు ఎక్కువ డబ్బులు వినియోగదారుల నుండి వసూళ్ళు చేస్తున్నారంటూ శీరం రామజోగి కలెక్టరుకు ఫిర్యాదు చేసారు. అలాగే స్థానిక విలేకర్లకు శుక్రవారం పత్రికా ప్రకటన రూపంలో అందజేసార. పిఠాపురం కేబుల్ టివి వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి శీరం రామజోగి ఈ విధంగా మాట్లాడుతూ గతంలో 60 రూపాయల వసూళ్ళు చేసేవారన్నారు. తరువాత 100 రూపాయలు వసూళ్ళు చేసే విధంగా వినియోగదారులతో ఒక ఒప్పందం కేబుల్ ఆపరేటర్లు చేసుకున్నారన్నారు. అయితే సెట్ ఆఫ్ బాక్స్‌లు వేసి 150 రూపాయల వసూళ్ళు చేస్తున్నారు. ప్రజలు అభ్యంతరం లేకుండా డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. అయితే కొత్తగా 200/- రూపాయలు వసూళ్ళు చేస్తున్నారని ఈ అధిక వసూళ్ళు ఆపేలా చర్యలు తీసుకోవాలంటూ కలెక్టరుకు ఫిర్యాదు చేసారని శీరం రామజోగి తెలిపారు.




*శుక్రవారంనాడు ప్రపంచ 'టీ' దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంవిపి కాలనీ సర్కిల్ వద్దగల టీస్టాల్ యజమాని (మువ్వల పైడిరాజు)ని ఆంధ్ర చైతన్య పార్టీ సభ్యులు, స్థానికులతో కలసి సన్మానించారు.*

# రైల్వే లైను పనుల శంకుస్థాపనకు

## రైల్వే మంత్రి ఆహ్వానించిన ఎంపీ డా. పండుల రవీంద్రబాబు



కాకినాడ : కోనసీమ కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పనుల శంకుస్థాపనకు రైల్వే మంత్రి పియూష్ గోయల్ డిల్లిలో మంత్రి కార్యాలయంలో అమలాపురం ఎంపీ డా.పండుల రవీంద్ర బాబు కలిసి రైల్వే లైను పనుల శంకుస్థాపనకు మంత్రిని ఆహ్వానించారు. దీనికి సానుకులంగా స్పందించిన మంత్రి పియూష్ గోయల్ శంకు స్థాపన కార్యక్రమానికి తప్పని సరిగా హాజరవు తానని హామి ఇచ్చారని అమలాపురం ఎంపీ డా. పండుల రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ సందర్భంగా ఎంపీ డా. పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కోనసీమ ప్రజల కల త్వరలో నెరవేరనుం దన్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రైల్వే మంత్రి పియూష్ గోయల్ హామి ఇచ్చరన్నారు.అలాగే శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మంత్రి నరేంద్ర మోదిని కూడా ఆహ్వానించడం జరుగుతుందని ఎంపీ తెలిపారు.

# ప్రజల కోసం సి.పి.యం. పార్టీ

## జిల్లా మహాసభలు విజయవంతం చేయండి - దువ్వా




పిఠాపురం : ప్రజలు కోసం పనిచేసే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) అని నేటి నుంచి జరగబోయే సి.పి.యం. 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలంటూ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సి.పి.యం. కార్యాలయంలో శేషబాబ్జి విలేకర్ల సమావేసం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలను పిఠాపురంలో 16, 17వ తారీకులలో నిర్వహిస్తున్నారన్నారు. డిసెంబరు 16న, 2గంటలకు ఆర్.టి.సి. బస్ స్టాండ్ నుండి ఉప్పాడ బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అలాగే 3 గంటలకు ఉప్పాడ బస్‌స్టాండ్ సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. అలాగే 16,17వ తేదీల్లో ఇనుగంటి రామతులసమ్మ నగర్‌లో గల లయన్స్ కళ్యాణ మండలంలో ప్రతినిధుల సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు ప్రతి ఇంటి నుండి ఒక్కొక్కరు చొప్పున ఊరంతా కదలి రావాలంటూ శేషబాబ్జి పిలుపునిచ్చారు.

ప్రజలకోసం సి.పి.యం.పార్టీ : దేశ వ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ కేవలం ప్రజల కోసం పనిచేసే వాళ్ళు మాత్రం కమ్యూనిస్ట్‌లేనని ఆయన పేర్కొన్నారు. బలహీనులకు అండగా ఉంటూ నిస్వార్థంగా ప్రజల పక్షాన్ని పోరాటా చేస్తున్నది మాత్రం సి.పి.యం. పార్టీయేనని అన్నారు. దళిత, గిరిజన, కార్మిక, రైతు, కూలీ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు తోడుగా ఉంటూ కార్మిక నాయకత్వంతో సమసమాజ స్థాపనే లక్ష్యంగా పని చేస్తున్నది సి.పి.యం పార్టీ అన్నారు. అధికారం కోసం ఆలోచించకుండా ప్రజల కోసం ఆలోచిస్తూ ప్రజా అవసరాలు కోసం ఉద్యమం చేస్తున్నది కమ్యూనిస్టులే అన్నారు. 2014 ఎన్నికల్లో ఎన్నో హామీలు కురిపించి ప్రజలను మభ్యపెట్టి కేంద్ర రాష్ట్రాలలో బి.జె.పి., టి.డి.పి.లు అధికారంలోకి వచ్చాయన్నారు.

నోట్లు రద్దు, జి.యస్.టి. వంటి నిర్ణయాల వల్ల ప్రజలు కకావికలం అయ్యారన్నారు. అయితే బి.జె.పి. మాత్రం ఈ నిర్ణయాలు చారిత్రాత్మక నిర్ణయాలంటూ గొప్పలు చెప్పుకోవడం విచారకరం అన్నారు. అలాగే రాష్ట్రంలో, రాష్ట్ర అభివృద్ధి, రాజధాని, సెజ్ పేరుతో రైతాంగం నుండి బలవంతంగా భూమిని సేకరించి, కార్పొరేట్ సంస్థలకు భూమిని కట్టబెడుతున్న ఘనత చంద్రబాబుదే అన్నారు. అలాగే రేషన్ షాపులను రిలయన్స్ సంస్థకు కట్టబెట్టి పేదవాడి కడుపు కొట్టేందుకు చంద్రన్న విలేజ్ మాల్ పేరుతో షాపులు తెరవడం భాదాకరం అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో దివీస్‌పై పోరాటం చేసి ఆపిన ఘనత సి.పి.యం.దే అన్నారు. అలాగే సెజ్ రైతులు కోసం ఉద్యం చేస్తుంటే తమ పార్టీ వాళ్ళను అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నారు. ప్రభుత్వాలు పై ప్రజలకు పూర్తి అవగాహన వచ్చిందన్నారు. వీటన్నిటికోసం ఉద్యమాలు చేసే ప్రజలు కోసం అనేక త్యాగాలు చేస్తున్న సి.పి.యం. నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలంటూ శేషబాబ్జి కోరారు. ఈ కార్యక్రమంలో కుర్రాకుల సింహాచలం, కోనేటి రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం



రావులపాలెం : స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన రూ.50 వేలు బాండును కర్రి రామకృష్ణారెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు అందజేసారు. ఈ కార్యక్రమంలో డిసిఎమ్‌ఎస్ చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ కొవ్వూరి జగన్నాధరెడ్డి, పున్నపు బూరయ్య, మండవిల్లి నగేష్, సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, దాసరి వెంకట ప్రసాద్, పోతుమూడి సత్యనారాయణ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్రభాను



# కుటుంబ కథా చిత్రమ్

## రివ్యూ

కథ, కథనాలు బాగుంటే అది చిన్న చిత్రమైనా ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారు. థ్రిల్లింగ్, హారర్ జోనర్ సినిమాలకు ఇంకా ఆదరణ ఎక్కువ ఉంటుంది. పరిమిత వనరులతో తెలిసిన నటులతో వి.ఎస్. వాసు తెరకెక్కించిన చిత్రం 'కుటుంబ కథా చిత్రమ్'. కేవలం ఎనిమిది రోజుల్లో దీనిని చిత్రీకరించారు. చిన్న చిత్రంగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేర ఆకట్టుకుంది?

కథేంటంటే: చరణ్(నందు), పల్లవి(శ్రీముఖి) భార్యాభర్తలు. వీరికో పాప. పల్లవి ఉద్యోగం చేయటం చరణ్‌కు నచ్చదు. 'నా కాళ్లపై నేను నిలబడటానికే ఉద్యోగం చేస్తా' అంటుంది పల్లవి. ఈ విషయంలో ఇరువురూ తరచూ గొడపడుతుంటారు. వారు ఉండే ఇంటికి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు కామరాజు(కమల్ కామరాజు). చరణ్ లేని సమయం చూసి పల్లవిపై అత్యాచారం చేయబోతాడు. ఒంటరిగా ఉన్న ఆ ఇంట్లో ఒక సైకోలాంటి వాచ్‌మెన్ బారి నుంచి తనను తాను ఎలా కాపాడుకుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే 'కుటుంబ కథా చిత్రమ్'

ఎలా ఉందంటే: ఇదో విభిన్నమైన చిత్రం. తెలిసిన కథనే దర్శకుడు ఒక భిన్నమైన స్క్రీన్‌ప్లేతో తీర్చిదిద్దాడు. తక్కువ పాత్రలతో సినిమాను తెరకెక్కించాడు. భార్యాభర్తల గొడవ.. పల్లవిపై సెక్యూరిటీ గార్డు అత్యాచారం యత్నం.. అతడి నుంచి పల్లవి తప్పించుకోవడం.. ఇలా సినిమా అన్ని కోణాల్లో సాగుతుంది. అయితే, దర్శకుడు ఎంచుకున్న పాయింటు కథని నడిపించిన తీరు వెండితెరపై చూడాల్సిందే. ఒక ఆసక్తికరమైన పాయింట్‌తో ప్రేక్షకుడిని రెండు గంటల పాటు కూర్చోబెట్టడం దుస్సాహసమనే చెప్పాలి. దర్శకుడి స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా సాగింది. విశ్రాంతికి ముందు వచ్చే ట్విస్ట్ కాస్త షాకింగ్‌గా ఉంటుంది. చాలా ఆసక్తికరమైన పాయింట్ వద్ద ఇంటర్వెల్ కార్డు వేయగలిగాడు. అదే పట్టును ద్వితీయార్ధం అంతా కొనసాగించలేకపోయాడు. మూడు పాత్రలతో ఒక ఇంట్లో ఇంత మంచి క్వాలిటీతో సినిమా తీర్చిదిద్దిన చిత్ర బృందాన్ని అభినందించాలి. ప్రేక్షకుడు ఈ సినిమా కాన్సెప్ట్‌ను యాక్సెప్ట్ చేస్తే కాస్త కొత్తగా అనిపిస్తుంది. అసంతృప్తి వ్యక్తమైతే ఈ ప్రయత్నం నీరుగారి పోయినట్టే!

ఎవరెలా చేశారంటే: కమల్ కామరాజు సైకో తరహా పాత్ర పోషించాడు. అతని నటన కాస్త విలక్షణంగా ఉంది. నందు, శ్రీముఖి పర్వాలేదనిపిస్తారు. సూర్య ఓ చిన్న పాత్రలో కనిపిస్తారు. దర్శకుడు వాసు ఆలోచన బాగుంది. షార్ట్ ఫిల్మ్, టెలీ ఫిల్మ్‌కు అయితే బాగా వర్క్ అవుట్ అయ్యేది. దాన్ని సిల్వర్ స్క్రీన్‌పై తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. తక్కువ బడ్జెట్‌లో మంచి అవుట్‌పుట్ వచ్చింది. కథ, కథనాల్లో వైవిధ్యం ఉంది. ఈ ప్లాన్‌తో సినిమాలు తీస్తే, కచ్చితంగా మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

## ఉచిత వైద్య శిబిరం



విశాఖపట్నం : ఓల్డ్ టిబి హాస్పిటల్ ప్రాంతంలో, సీతమ్మపేట, ద్వారకానగర్ దగ్గరలో ఉన్న విప్రో కంపెనీలో మైక్యూర్ హాస్పిటల్ వైద్య శిభిరం నిర్వహించారు. మైక్యూర్ హాస్పిటల్ సౌజన్యంతోనిర్వహించిన డయాబెటిక్ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. మైక్యూర్హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిభిరాన్ని మానవ వనరులు అధికారి విజయ్ గోపాల్గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు అశోక్ మరియు వైద్య బృందం 200 మందికిపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికీ మందులు ఉచితంగా అందజేశారు. విప్రో సిబ్బందికిమరియు విప్రో ఉద్యోగులకు కంటి పరీక్షలతో పాటు ఈసిజి, బీపీ, పొడువు మరియు బరువుపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అశోక్ వైద్య బృందం మెరుగైన ఆరోగ్య విషయం లోసలహాలు, సూచనలు అందించారు.

## ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం

### జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : జివియంసి పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు చేయబడుతున్నది. ఈ పథకం క్రింద గ్రూప్ హౌస్ స్కీం విభాగం క్రింద 4120 గృహాలు (మొదటి దశలో) జివియంసి పరిధిలో ఐదు లే అవుట్లయందు నిర్మించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి అనుమతులు పొందటమైనది. గృహ నిర్మాణం వివిధ దశలలో ఉన్నది. ఈ గృహ మంజూరుకు జి.ఓ నెం.263 ప్రకారం ప్రభుత్వం సెలక్షన్ కమీటిని ఏర్పాటు చేయటమైనది.

గృహ మంజూరు ఈ కమిటీ ద్వారా మాత్రమే జరుగును 4120 గృహాల మంజూరు ఇప్పటికే పూర్తి అయినది.

రెండవ దశలో 13620 గృహాలు నిర్మించుటకు ప్రభుత్వం ఆమోదించినది. ఇవి టెండర్లు దశలో ఉన్నది. మూడవ దశలో 35,899 ఇళ్ళ మంజూరుకు డిపిఆర్‌లు పంపటమైనది. ఇలా వివిధ దశలలో స్థలాల లభ్యత బట్టి దరఖాస్తు చేసుకొని అర్హత గల ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయుటకు ప్రతిపాదనలు పంపుటకు తగు చర్యలు తీసుకొనబడుచున్నవి. 2022 సంవత్సరం లోపు అందరికి ఇళ్ళు మంజూరు చేయుట ఈ పథక లక్ష్యం

కావున, ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకున్నవారు గృహ మంజూరు కొరకు మీ సేవా కేంద్రాలను కాని, జివియంసి జోనల్ కార్యాలయాల కు కాని లేదా పి.యం.ఏ.వై సెల్ కార్యాలయాన్ని కాని సందర్శించవలసిన ఆవశ్యకత లేదు. దరఖాస్తు దారులు ఎటువంటి ప్రైవేట్ వ్యక్తులను గృఋ మంజూరు కొరకు సంప్రదించవద్దని కోరటమైనది.

కావున దరఖాస్తు దారులు గమనించి మీ సేవా కేంద్రాలను గాని, జివియంసి కార్యాలయాలను గాని సంప్రదించవలసిన ఆవశ్యకత లేదని తెలియజేయటమైనది. మంజూరుకు ముందర ఎటువంటి రుసుము ఎక్కడ గాని చెల్లించవలసిన అవసరం లేదని తెలియజేయటమైనది.

## అంకిత భావంతో విధులు నిర్వర్తించిన

### - డ్రయివర్లకు ప్రశంసా పత్రాలు

### - జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనల మేరకు అన్ని అర్బన్ లోకల్ బాడీస్ (యు.ఎల్.బి) లకు చెందిన, అంకితభావం గల డ్రయివర్లకు ప్రశంసా పత్రాలను కమిషనర్ హరినారాయణన్ తన ఛాంబర్‌లో శుక్రవారం ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆగష్టు నెల నుండి ప్రతి నెల ఒక్కోజోన్‌కు చెందిన ఉత్తమ, సమర్థత కనపరచిన డ్రయివర్లను ఎంపిక చేసినట్లు వివరించారు. డ్రయివర్లలో పోటితత్వం, అంకితభావం పెంపొందడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

వారిని ప్రోత్సహించడానికి, ఉత్సాహం పెంపొందిం చడానికి ఉపకరిస్తుందని వెల్లడించారు.

జోన్‌కు ఒకరు చొప్పున, ప్రధాన కార్యాలయం నుంచి చొప్పున ఎంపిక చేసి 28 మందికి ప్రశంసా పత్రాలు జారీ చేశారు.

ఒకటవ జోన్ నుండి బూడుమూరు అప్పారావు, రెండవజోన్ నుండి యం.అప్పలరాజు, డి.ప్రసాద్, ఏ.ఎర్రయ్య, మూడవ జోన్ నుండి యం.హరీష్, నాలుగవ జోన్ నుండి పి.కిశోర్, పి.సతీష్, ఐదవ జోన్ నుండి కె.సత్యారావు, యస్.అప్పారావు లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్ పాల్గొన్నారు.

## పీఆర్ఎస్ఐ 39వ అఖిలభారత సమావేశాలు ప్రారంభం



విశాఖపట్నం : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ)39వ అఖిల భారత సమావేశం విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. 'ఎమర్జింగ్ ఇండియా -స్మార్ట్ సిటీస్- స్మార్ట్ కమ్యూనికేషన్' లక్ష్యంతో 15,16,17 తేదీలలో మూడు రోజులపాటు వేర్వేరు చోట్ల నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను ముఖ్య అతిథి, ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు లాంఛనంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 25 చాప్టర్లు కలిగి 3000 పైచిలుకు సభ్యులున్న పీఆర్ఎస్ఐ ఈ ఏడాది జాతీయ సమావేశాలను విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ప్రజాసంబంధాలు (పబ్లిక్ రిలేషన్స్) రంగంలో అత్యుత్తమ సేవలందించిన పలువురు వృత్తి నిపుణులను తొలి రోజు సమావేశంలో 'పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డులు-2017' ముఖ్య అతిథి గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. పీఆర్ఎస్ఐ అమరావతి చాప్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ముఖ్య అతిథి గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథి అనకాపల్లి పార్లమెంటు సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు 'ఎమర్జింగ్ ఇండియా స్మార్ట్ సిటీ-స్మార్ట్ కమ్యూనికేషన్' అనే అంశంపై ఈ సదస్సు లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు. ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎ. ప్రసన్న కుమార్ కీలకోపన్యాసం చేస్తూ ' మానవ సంబంధాల మెరుగునకు ప్రజా సంబంధాలు దోహదం చేయాలన్నారు. దీనికి పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా 39వ జాతీయ సమావేశంలో ఇచ్చే 'ఇన్‌పుట్' 'ఔట్‌పుట్' కంటే ఈ మూడు రోజుల సదస్సులో గ్రహించి తమ వెంట తీసుకువెళ్లే జ్ఞానం 'ఔట్ కమ్' చాలా విలువైనదన్నారు. 60 ఏళ్ల క్రితం విద్యార్థిగా తాను విశాఖలో అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ నగరంలో చోటు చేసుకున్న ముఖ్య సంఘటనలు, అభివృద్ధిని ఆయన క్లుప్తంగా విశ్లేషించారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, దక్షిణ భారత విభాగం ఉపాధ్యక్షులు యూఏ శర్మ, సమావేశాల ఛైర్మన్ డాక్టర్ డీవీఆర్ మూర్తి, కార్యదర్శి పీఎల్‌కే మూర్తి, కాన్ఫరెన్స్ అంబాసిడర్ వై. బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ విద్యార్థినులు 'స్వచ్ఛ భారతం స్వేచ్ఛా భారతం' అనే పల్లవితో సాగే గీతానికి చక్కటి సమన్వయంతో కూడిన నాట్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఆహూతులను రంజింపజేశారు.




## ఉచిత పశువైద్య శిభిరం

అచ్యుతాపురం: మండలంలో గల నాయనమ్మపాలెం గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశు సంవర్ధక శాఖ వారి ఆద్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో 12 పశువులకు గర్భకోశ వ్యాదులు, 6 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 8 ఎదకురాని పశువులకు, 15 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, 5 సాధారణ చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసామని వైద్యాదికారిణి డాక్టర్. ప్రియాంక తెలిపారు. ఈ శిభిరంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ కె.సుబ్రమణ్యం, గోపాలమిత్రలు కె.రామారావు ఉన్నారు.

## ఆబ్జెక్టివ్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలి



అచ్యుతాపురం: బహుళైచ్ఛిక పరీక్షా విదానాన్ని రద్దుచేసి వివరణాత్మక పరీక్షా విదానాన్ని పునరుద్దరించాలని ఆంధ్ర ప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ జి.మదు డిమాండ్ చేసారు. శుక్రవారం ఆయన కమిటీ ప్రతినిదులతో కలిసి స్థానిక విలేకర్లతో మాట్లాడారు. విద్యార్ది యొక్క అవగాహన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, విశ్లేషణ సామర్ద్యాలను తెలుసుకోవటానికి వివరణాత్మక పరీక్షా విధానం అవసరమన్నారు. బహుళైచ్ఛిక పరీక్షా విధానాన్ని తీసుకురావడం కార్పొరేట్ అనుకూల చర్య అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పుణరాలోచన చేసి వివరణాత్మక పరీక్షా విధానాన్ని పునరుద్దరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మారిశెట్టి వెంకటప్పారావు, కొల్లి రాజు, దోని నూకరాజు, కె.చిరంజీవరావు తదితరులు ఉన్నారు.

## గృహ లబ్దిదారులకు బ్యాంక్‌ల ద్వారా ఋణసదుపాయం

### జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జివియంసి పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 4120 గృహాలు ఐదు లే అవుట్లయందు నిర్మించబడుచున్నవి. ఈ గృహాలు ఎపిటిఐడిసిఒ వారి ద్వారా నిర్మాణం జరుగుచున్నది. సదరు గృహాలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా సెలెక్షన్ కమిటీ వారి ద్వారా ఎంపిక చేయబడుచున్నది.

సదరు 4120 గృహాలకు బ్యాంక్‌ల ద్వారా ఋణమంజూరు కొరకు నగర పరిధిలో గల వివిధ బ్యాంక్‌ల కంట్రోలర్ మరియు కోఆర్డినేటర్‌లతో కమిషనర్ ఛాంబర్ యందు సమావేశం నిర్వహించటమైనది.

ఈ సమావేశం యందు గృహాల నిర్మాణం, ప్రగతి మరియు గృహ ఋణ మంజూరు ఆవశ్యకతను తెలియజేయుటమైనది. బ్యాంకులు గృహ ఋణ మంజూరుకు సహకరించాలని ఏమైన సమస్యలు ఉన్న యెడల జివియంసి వారికి బాసటగా ఉంటుందని కమిషనర్ హరినారాయణన్ కోరారు. కమిషనర్ వారి విజ్ఞప్తి మేరకు బ్యాంకుల వారి మార్గదర్శకాల ప్రకారం గృహ ఋణ మంజూరుకు సహకరించగలవారమని బ్యాంకు అధికారులు హామి ఇచ్చినారు. బ్యాంకుల వారి అంగీకారం ఒక వారం రోజులలో తెలుపగలవారమని తెలియజేశారు.

ఈ సమావేశంలో జివియంసి ప్రాజెక్టు డైరక్టర్ శ్రీ డి.శ్రీనివాసన్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీ డి.రాంబాబు, ఎపిటిఐడిసిఒ సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీ సి.హెచ్ యు.కె.కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ డి.నరసింహామూర్తి, రాష్ట్ర బ్యాంకులింకేజి స్పెషలిస్టు ఎమ్.వి.నారాయణరెడ్డి, జిల్లా బ్యాంకు లింకేజి సమన్వయకర్త అశోక్‌బాబు, యుసిడి అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు మరియు ఎపిటిఐడిసిఒ నగర స్థాయి సాంకేతిక విభాగం స్పెషలిస్టులు పాల్గొన్నారు.

## పవన్ గొప్ప నాయకుడు అవుతాడు: వర్మ

హైదరాబాద్: సినీ నటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కి ధన్యవాదాలు చెప్పాలని ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఆయన ఈ విషయాన్ని ఫేస్‌బుక్ వేదికగా పంచుకున్నారు. పవన్ ఓ గొప్ప నాయకుడు అవుతారని చెప్పారు. ఇప్పుడే పవన్‌కల్యాణ్ కొత్త ప్రసంగం చూశాను. ఆయనకు వివిధ అంశాల పట్ల ఉన్న అవగాహనను గమనించి చాలా థ్రిల్ అయ్యా. ఆయనకు గతం, భవిష్యత్తుపై చాలా స్పష్టత ఉంది. ఆయనపై ఉన్న పలు వదంతులపై స్పష్టత ఇవ్వడం.. ఆయన అద్భుతమైన నిజాయతీని తెలుపుతోంది. ఇతరులపై తన అభిప్రాయాల్ని, ఆలోచనల్ని పంచుకోవడానికి, వారి పేర్లను నేరుగా ప్రస్తావించడానికి ఆయన ఇబ్బంది పడలేదు.. ఇది ఆయన సమగ్రతకు సాక్ష్యంగా నిలిచింది

ఆయన (పవన్) ఏదైనా మాట్లాడే ముందు ఆలోచిస్తారని చెప్పారు. పవన్ నుంచి నేను నేర్చుకోవాల్సిన పాఠం ఇది.. ఎందుకంటే నాకు ఓ చెడ్డ అలవాటు ఉంది. ఆలోచించకుండా హఠాత్తుగా మాట్లాడి, ఎలాంటి ఆలోచన లేకుండా ట్వీట్ చేస్తుంటా.

ఈ నేపథ్యంలో పవన్‌కల్యాణ్‌కు నేను కృతజ్ఞతలు చెప్పాలి. ఆయన ఓ గొప్ప నాయకుడు అవుతారు అని వర్మ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, యునెస్కో, మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ పీస్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా విశాఖపట్నంలో డిసెంబర్ 16 నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న సద్సుకు ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మంత్రి నోవోటెల్ నందు సదస్సు నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. విద్యలో మానవీయ విలువలను జోడించి అత్యాదునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధిస్తూ, విద్యార్థులకు వత్తిడిలేని చదువును అందించాలన్న సమున్నత లక్ష్యంతోనే ఈ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి సదస్సు ఆసియా, పసిఫిక్ దేశాల్లో ఇదే మొదటిదని, ఈ సదస్సుతో


# యునెస్కో, ఆంధ్రప్రదేశ్ చొరవతో
# టెక్ సదస్సు

## మేథోమథన సదస్సుకు ఏర్పాట్లు పూర్తి .. బోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు
## మానవీయ విలువలే ప్రధానంగా చర్చ
## రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని అన్నారు. ప్లీనరీలు, బ్రేక్ అవుట్ సెషన్లు, డిబేట్లు, చర్చల ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ప్రమాణాలు వుండేలంటే ఏం చేయాలి అనే అంశంపై మేథోమథనం చేస్తారని, తదనంతరం వీటి అమలుకు కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఐటి, టూరిజంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెడుతోందని, విశాఖపట్నం ప్రధానంగా అనేక స్టార్టప్ కంపెనీలు, ఐటి సంస్థలు వస్తున్నాయని అన్నారు. నూతన ఐటి పాలసీ ద్వారా లక్ష ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. అనంతరం యునెస్కో చైర్మన్ కరణ్ సింగ్ మాట్లాడుతూ సాంకేతికతపై అపార అనుభవం వున్న వ్యక్తులు ఈ సదస్సుకు హాజరు కానున్నారని, ఇలాంటిగొప్ప కార్యక్రమానికి ప్రోత్సహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనీయులని అన్నారు. మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఫర్ పీస్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అనంత్ దురయ్య మాట్లాడుతూ పిల్లలు ఆటలపై ఎంత ఆసక్తి చూపుతారో పాఠ్యాంశాలపై కూడా అంతే ఉత్సాహాన్ని చూపేలా వత్తిడి లేని విద్యనందించడమే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య సెక్రటరీ ఉదయలక్ష్మి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, సంయుక్త కలెక్టర్ సృజన పాల్గొన్నారు.

# విశాఖ ఐటీఐఆర్‌లో ముందడుగు లేదు



న్యూఢిల్లీ : విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలనుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్టిమెంట్ రీజియన్(ఐటీఐఆర్) ప్రతిపాదన( ఆగస్టు 26, 2014)ను ఇంకా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి పంపించలేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయమంత్రి ఆల్ఫోన్స్ కన్నాంతనమ్ వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం తరుపున లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. గతంలో భువనేశ్వర్‌లో కూడా ఐటీఐఆర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన కూడా వచ్చిందని అయితే దీని ఏర్పాటులో సమగ్రంగా పున: పరిశీలించాలని ఆదేశించామని, ఆ ఆదేశాల అనంతరం అందులో సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు.

ఈ సవరణ మేరకు కేబినెట్ కమిటీకి ఒక నోట్ కూడా సమర్పించామని, అది జరిగితే ఏపీ ప్రతిపాదనను పంపిస్తామన్నారు. అలాగే జీఎస్‌టీ తర్వాత రైల్వే కాంట్రాక్ట్ పనుల విషయంలో కోరిన వివరణకు కూడా కేంద్రం సమాధానం చెప్పింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దక్షిణ మధ్య రైల్వేలోని ఓపెన్ లైన్, కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా పనులు నిలిపేసిన విషయం వాస్తవమేనని రైల్వే శాఖ సహాయ మంత్రి రాజేన్ గోహైన్ తెలిపారు. అయితే, శాఖ పరమైన వనరులను తరలించి ఎక్కడ అవసరం అయితే అక్కడ ట్రాక్ భద్రత పనులు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.



నగరంలో శ్రీ సత్యసాయి విద్యామందిర్, ఎంవిపి కాలనీలో క్రికెటర్ గంభీర్ సందర్శించి స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం సైకిలింగ్‌లో పాల్గొన్నారు.

# టీ10లో ఆఫ్రిది మరో సంచలనం..

## సెహ్వాగ్ వికెట్ తీసి హ్యాట్రిక్ నమోదు!



షార్జా: పాకిస్థాన్ మాజీ డ్యాషింగ్ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది క్రికెట్ నుంచి రిటైరైనా తనలో సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో జరిగిన టీ10 లీగ్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో వేసిన తొలి ఓవర్ మూడు బంతులకు మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ నమోదు చేశాడు.

పక్తూన్స్ జట్టు తరపున ఆడుతున్న ఆఫ్రిది తాను వేసిన తొలి ఓవర్‌లోనే అద్భుతం చేశాడు. ఇందులో మరో ముఖ్యమైన విషయం ఏంటంటే ఔటైన ముగ్గురిలో ఒకరు మరాఠా అరేబియన్స్ కెప్టెన్ అయిన వీరేంద్ర సెహ్వాగ్ ఉండడం.

తొలి బంతికి సౌతాఫ్రికా బ్యాట్స్‌మన్ రిలీ రోస్సో ఔట్ చేసిన ఆఫ్రిది, రెండో బంతికి డ్వాన్ బ్రావోను పెవిలియన్ పంపాడు. మూడో బంతికి సెహ్వాగ్‌ను ఔట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఫఖ్తూన్స్ జట్టు పది ఓవర్లలో 121 పరుగులు చేసింది. ఫకర్ జమాన్ 22 బంతుల్లో అజేయగా 45 పరుగులు చేశాడు. 122 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన మరాఠా అరేబియన్స్ జట్టు 25 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఇంగ్లండ్ ఆటగాడు అలెక్స్ హేల్స్ 26 బంతుల్లో 57 పరుగులు చేసినా జట్టును పరాజయం నుంచి కాపాడలేకపోయాడు.




ఆళ్వార్‌దాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ సుంకరి రవీంద్ర గ్రీన్ డేల్ స్కూల్ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అద్భుతమైన విద్యను ఆటపాటలతో పాటు అందిస్తుందని అన్నారు. విద్యారంగంలో 35 సంవత్సరాలకు పైగా ఆళ్వార్ గ్రూప్ చైర్మన్ అన్నారు. కేవలం చదువే కాకుండా పెయింటింగ్, శిల్పకళలు, పాటరీ, సంగీతం తదితర వాటిపై శ్రద్ధ గల విద్యార్థులను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.






## మంచులో విరుష్క దంపతుల సరదాలు

న్యూఢిల్లీః టీమిండియా క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ, బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ ఇటీవల ఇటలీలో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి రిసెప్షన్ ముంబైలో, ఢిల్లీలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. పెళ్లి చేసుకున్న ఈ కొత్త జంట హనీమూన్‌లో సరదాగా గడుపుతున్నారు. యూరప్‌లో తుంపరలా కురుస్తున్న మంచులో కోహ్లీ, అనుష్క హనీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

# ఇంటివద్దనే తడి-పొడి చెత్త వేరు చేయండి

## జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: విశాఖ నగర వాసులు ఇంటివద్దనే తడి-పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య (ప్రజారోగ్య) కార్మికులకు ప్రతి రోజుఅందజేయాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 21వ వార్డులో శుక్రవారం పర్యటించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భమగా మదాలస అపార్ట్‌మెంట్స్, దయాల్ అపార్ట్‌మెంట్స్, రాజమణీస్ సాయినందనం అపార్ట్‌మెంట్స్, విజయ సూర్యగంధం అపార్ట్‌మెంట్లను సందర్శించి కార్యదర్శులు, వాచ్‌మన్‌లతో సంభాషించారు. సదరు అపార్ట్‌మెంట్లులలో చెత్తను అందజేసి వేరు వేరు బుట్టలలో వేస్తున్నప్పటికి చాలా మంది తడి-పొడి చెత్తను కలిపేస్తున్నట్లు కమిషనర్ గుర్తించారు. అపార్ట్‌మెంట్ వాసులు వారి వంటగది, సిట్ అవుట్లలో తడి చెత్తకు ఒక బుట్ట, పొడి చెత్తకు ఒక బుట్ట ను అమర్చి దిగువనున్న పెద్ద డబ్బాలలో విడివిడిగా వేయాలని, సర్వెంట్‌మెయిడ్స్‌తో వేయించి సహకరించాలని కోరారు. ఆవిధంగా విడదీసి అందజేయని అపార్ట్‌మెంట్, లేదా నివాశితుల గృహాలకు జరిమానా విధించడం, జరిమానా చెల్లించనట్లయితే కుళాయి కనెక్షన్ కట్‌చేయాలని పేర్కొన్నారు. ప్రజారోగ్య రీత్యా కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. మనఇల్లు, మన అపార్ట్‌మెంట్, మనవీధి, మననగరం స్వచ్ఛ నగరంగా రూపొందించడం ప్రజల చేతుల్లో ఉందని, పారిశుధ్య కార్మికుల సహకారంతో స్వచ్ఛ విశాఖ, ఆనంద, ఆరోగ్య విశాఖగా రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ భారత్ ఆదేశాలు పాటించడం ప్రజలందరి కర్తవ్యంగా పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి అపార్ట్‌మెంట్ వాసిని చైతన్యవంతం చేయడం, వాచ్‌మన్‌లు, సర్వెంట్ మెయిడ్స్ సహకారంతీసుకోవాలని ఆదేశించారు. సహకరించని అపార్ట్‌మెంట్ వాసులకు జరిమానా విధించాలని, జరిమాన చెల్లించని వారి త్రాగునీరు కనెక్షన్ కట్‌చేయాలని పేర్కొన్నారు. చెత్త రహిత గృహాలుగా, అపార్ట్‌మెంట్లుగా, నగరంగా విశాఖ రూపొందాలని అభిలషించారు.

పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ మీషాసింగ్, జోనల్‌కమిషనర్ వి.చక్రధరరావు, ఏ.యం.ఓ.హెచ్ డా.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇ.ఇ గణేష్‌కుమార్, ఏ.ఇ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీమోహన్, ఏసిపి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తొలుత 21వ వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం 20వ వార్డులోని ఆర్.కె.బీచ్‌ను పరిశీలించి సుందరీకరించాలని, చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com